# ప్రజా తపన

prajathapana.com

News that matters




ఐదు అత్యుత్తమ భావాలను సరిగా అర్థం చేసుకుని, ఆచరిస్తూ వాటితో నిత్య జీవితాన్ని మలచుకుంటే, మొత్తం గ్రంథాలయాన్నే కంఠస్థం చేసిన వారి కన్నా మీరు ఎక్కువ విద్యావంతులు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 11 శుక్రవారం 17 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# భారత్ కు మరో 12 చిరుతలు


**న్యూఢిల్లీ :**



రత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చిరుత పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18న దక్షిణాఫ్రికా నుంచి రెండో బ్యాచ్ చీతాలు భారత్‌కు రానున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కునో జాతీయ పార్కుకు పన్నెండు చిరుతలను రప్పిస్తున్నామని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి చిరుతలు రవాణా చేయడానికి జనవరిలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇరుదేశాలు అవగాహన ఒప్పందంపై సంతకం చేశాయి. భారత్ కు చేరుకున్న అనంతరం ఈ 12 చిరుతపులలను నిబంధనల ప్రకారం వాటిని నెలరోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచనున్నారు. ఈ చిరుతలు ఏమైనా ఇన్ఫెక్షన్ ఉంటే ఇతర జంతువులకు వ్యాపించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోనున్నామని చెప్పారు. ఇతర జంతువులకు దూరంగా ఒక నెల రోజుల పాటు ఈ చిరుతలు విద్యుత్ ఎన్‌క్లోజర్‌లో ఉంచుతారు."దక్షిణ ఆఫ్రికా నుంచి 12 చిరుతలను మన దేశానికి తీసుకురావడానికి ఎంఈ అ-17 ఎయిర్ క్రాఫ్ట్ ఈ రోజు ఉదయం హిండన్ ఎయిర్‌బేస్ నుండి బయలుదేరింది. ఈ చిరుతల తరలింపు కోసం ఎంఈ ఎటువంటి మొత్తాన్ని వసూలు చేయడం లేదు. రేపు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మంత్రి భూపేంద్ర యాదవ్ లు కునో నేషనల్ పార్క్‌లో చిరుతలను విడుదల చేస్తారు.గత ఏడాది సెప్టెంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 72వ పుట్టినరోజు సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లోని నమీబియా నుంచి తీసుకొచ్చిన ఎనిమిది చిరుతలతో కూడిన తొలి బ్యాచ్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ ఎనిమిది చిరుతల్లో ఐదు ఆడ, మూడు మగ చిరుతలు. ఇవి ప్రస్తుతం కేఎన్‌పీలోని ఎన్‌క్లోజర్‌లో ఉన్నాయని.. చాలా ఆరోగ్యంగా ఉన్నాయని అధికారులు చెప్పారు. అయితే వీటిల్లో ఒకదానికి క్రియాటినిన్ స్థాయిలు పెరిగి అస్వస్థతకు గురైంది. చికిత్స అనంతరం ఆ చిరుత కోలుకుందని చెప్పారు. ప్రస్తుతం అన్ని చిరుతలు కునో నేషనల్ పార్క్‌లోని తమ పరిసరాలకు బాగా అలవాటు పడ్డాయి అని వైల్డ్‌లైఫ్ డిజి ఎస్‌పి యాదవ్ తెలిపారు.

# ఐపీసీ సీఆర్‌పీసీ చట్టాలలో సమూల మార్పులు- అమిత్ షా

**న్యూఢిల్లీ :**



ఐపీసీ సీఆర్‌పీసీ చట్టాలలో సమూల మార్పులు తీసుకురానున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. రానున్న రోజుల్లో ఫోరెన్సిక్ ఎవిడెన్స్ చట్టాల్లో చాలా మార్పులు రానున్నాయని సంచలన ప్రకటన చేశారు. మాదక ద్రవ్యాల వ్యాపారులపై కఠినమైన శిక్షలు విధించబడ్డాయన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన పోలీసు వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి అమిత్ షా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులకు మొబైల్ ఫోరెన్సిక్ సైన్స్ వ్యాన్‌లు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వ్యాన్‌లు.. కేసులను త్వరగా ఛేదించడంలో, సాక్ష్యాలను సేకరించడంలో సహాయపడతాయన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ వ్యాన్లు.. 6 సంవత్సరాలు కంటే ఎక్కువ శిక్ష విధించే కేసులలో చాలా ముఖ్యమైనవన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా వామపక్ష తీవ్రవాదాన్ని దాదాపు అదుపులోకి తీసుకువచ్చామని అమిత్ షా పేర్కొన్నారు. ఈశాన్య భారతంలో... ఉన్న తీవ్రవాద గ్రూపులతో చర్చలు జరిపి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చామన్నారు. స్వాతంత్ర్యానికి ముందు పోలీసుల పనిలో సేవ లేదని.. ఇప్పుడు అది మారిందన్నారు. కరోనా సమయంలో... ఢిల్లీ పోలీసులు చేసిన సేవలు అమోఘం అని హోం మంత్రి ప్రశంసించారు. జీ-20 (ఉ-20) ఈవెంట్‌కు పలు దేశాల అధ్యక్షులు హాజరవుతున్నందున ఢిల్లీ పోలీసులు చాలా అప్రమత్తంగా ఉండాలని అమిత్ షా సూచించారు.

## ఎం.ఎ. తెలుగులో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థుల నుండీ దరఖాస్తులు స్వీకరణ



**ప్రజా తపన :**

రాచనగరి మైసూరులోని కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు తెలుగు విభాగం తరపున జనవరి2023 విద్యాసంవత్సరానికి డిగ్రీ, మరియు స్నాతకోత్తర కోర్సుల ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలుగు విభాగాధిపతి ఆచార్య ఎం. రామనాథం నాయుడు ఒక ప్రకటణలో తెలియజేశారు. చదువుకోవాలనే కోరిక ఉండి, అనివార్యకారణాల వల్ల విశ్వవిద్యాలయ విద్యకు దూరమైనవారికి, ఉన్నత విద్య అందరికీ అందుబాటులో అనే నినాదంతో ఇంటింటికీ ఉనత విద్య అనే ధ్యేయోద్దేశంతో కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎం.ఎ. తెలుగు ను దూరవిద్యావిధానంతో అభ్యసించడానికి అవకాశం కల్పిస్తోంది. ఈ సదావకాశాన్ని ప్రపంచంలోని తెలుగువారందరూ ఉపయోగించుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు, డిగ్రీలో తెలుగును విషయాంశంగా చదవకపోయినా కూడా ఎం.ఎ. తెలుగులో ప్రవేశం పొందవచ్చు అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో 23 ప్రాదేశిక కేంద్రాలు,146 అధ్యయన కేంద్రాలు ఉన్నాయని వారికి అనుకూలమైన కేంద్రంలో విద్యార్థులు చేరవచ్చని, పరీక్షలు కూడా ఆ కేంద్రాలలోనే రాసుకోవచ్చని తెలిపారు. మహిళకు, ఉద్యోగులకు అందరికీ పరీక్షల సమయంలో సౌకర్యాలున్న వసతి సౌలభ్యం కూడా కల్పిస్తున్నట్లు తెలియజేశారు. మరిన్ని వివరాలకు 8762357996/9985509053/9666 454688 సంప్రదించవచ్చని తెలిపారు.

## పెరుగుతున్న క్రిప్టో కరెన్సీ మోసాలు



**హైదరాబాద్ :**

హైదరాబాద్ నగరంలో క్రిప్టో కరెన్సీ మోసాలు రోజురోజుకి పెరుగుతున్నాయి. భాగ్యనగరంలో తాజాగా వెలుగు చూస్తున్న మోసాల్లో సైబర్ మోసాలు అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే హైదరాబాద్ లోని కూకట్ పల్లిలో క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసానికి పాల్పడిందో కంపెనీ యాజమాన్యం. ఎక్స్ సీఎస్పీఎల్ అనే కంపెనీ.. లక్ష రూపాయలు ఇన్వెస్ట్ చేస్తే.. 90 రోజుల్లో 4 లక్షలు ఇస్తామంటూ ఆశ చూపింది. ఆపై చాలా మంది అమాయక ప్రజల నుంచి లక్షల్లో దోచేశారు. 90 రోజుల్లోపెట్టుబడి డబ్బులకు 4 శాతం ఎక్కువ ఇస్తామని చెప్పడంతో వందలాది మంది డబ్బులు చెల్లించారు. ఇందులో చాలా మంది అప్పులు చేసి,

(మిగతా 2లో)

# త్రిపురలో ముగిసిన పోలింగ్



**న్యూఢిల్లీ :**

త్రిపురలో పోలింగ్ ముగిసింది. ఇప్పటికే రెండు రౌండ్లు పూర్తయ్యాయి. 73%కిపైగా ఓటు శాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 60 అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉంది. ఈ సారి కూడా విజయం తమదే అన్న ధీమాతో ఉన్నాయి పార్టీ శ్రేణులు. ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా....ప్రజలు మరోసారి బీజేపీకే పట్టం కడతారని అన్నారు. దాదాపు 30 ఏళ్ల పాటు సిపిఎం పాలనలో ఉన్న త్రిపురలో...2018లో అధికారం మారిపోయింది. అసలు అక్కడ ఉనికే లేని బీజేపీ ఆ ఎన్నికల్లో పోటీ చేసింది. అయినా...60 సీట్లలో 36 చోట్ల విజయం సాధించింది. మ్యాజిక్ ఫిగర్‌కు ఎక్కువగానే సీట్లు వచ్చినప్పటికీ ఇండీజినీయస్ ప్రోగ్రేసివ్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్టీ)తో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే..పూర్వ వైభవం కోసం ప్రయత్నం చేస్తున్నసిపిఎం ఈ సారి కాంగ్రెస్‌తో కలిసి పోటీలోకి దిగింది. అంతకు ముందు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన మాణిక్ సర్కార్‌తో విస్తృతంగా ప్రచారం చేయించింది. మొత్తం 60 సీట్లలో 47 చోట్ల సిపిఎం పోటీ చేయగా...మిగతా 13 చోట్ల కాంగ్రెస్‌కు అవకాశమిచ్చింది. 2018లో సిపిఎం 18 సీట్లు మాత్రమే సాధించింది. అప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఒక్క చోట కూడా గెలవలేదు. అందుకే ఈ సారి సీపీఎంతో కలిసి ఎన్నికల బరిలోకి దిగింది. ఇక్కడ విచిత్రం ఏంటంటే..కేరళలో సిపిఎం, కాంగ్రెస్ ప్రత్యర్థులుగా ఉంటే...త్రిపురలో మాత్రం ఈ సీన్

(మిగతా 2లో)

# ఆంధ్ర భోజుడు, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి "శ్రీ కృష్ణదేవ రాయలు"

**-నేడు ఆయన జయంతి**

శ్రీ కృష్ణదేవ రాయలు అత్యంత ప్రసిద్ధ విజయనగర సామ్రాజ్య చక్రవర్తి. సాళువ నరసనాయకుడి వద్ద మహాదండనాయకుడుగా పనిచేసిన తుళువ నరసనాయకుని మూడవ కుమారుడు శ్రీకృష్ణదేవరాయలు. నరసనాయకుడు పెనుకొండలో ఉండగా, రెండవ భార్య నాగలాంబకు 1471 జనవరి 17న జన్మించాడు కృష్ణదేవరాయలు. ఈయన పాలనలో విజయనగర సామ్రాజ్యము అత్యున్నతస్థితికి చేరుకున్నది. కృష్ణరాయలను తెలుగు మరియు కన్నడ ప్రజలు భారతదేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో ఒకడిగా అభిమానిస్తారు. సాహిత్యములో ఈయన ఆంధ్ర భోజుడుగా మరియు కన్నడ రాజ్య రమారమణగా కీర్తించబడినాడు. రాయలకు ప్రధాన మంత్రి తిమ్మరుసు. శ్రీకృష్ణదేవరాయలు సింహాసనం అధిష్ఠించడానికి తిమ్మరుసు చాలా దోహదపదడినాడు. కృష్ణరాయలు తిమ్మరుసును పితృసమానునిగా గౌరవించి "అప్పాజీ" (తండ్రిగారు) అని పిలిచేవాడు.రాయలు, తుళువ నరస నాయకుని రెండవ భార్య అయిన నాగలాంబ (తెలుగు ఆడపడుచు) కుమారుడు. ఇతను ఇరవై సంవత్సరాల వయసులో ఫిబ్రవరి 4, 1509న విజయనగర రత్నసింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతని పట్టాభిషేకానికి అడ్డురానున్న అచ్యుత రాయలు నూ, వీర నరసింహ రాయలు నూ, అనుచరులనూ తిమ్మరుసు సుదూరంలో ఉన్న దుర్గములలో బంధించాడు. రాయలు తల్లి నాగలాంబ గండికోటను పాలించిన పెమ్మసాని నాయకులు ఆడపడచు. 240 కోట్ల వార్షికాదాయము ఉంది. రాయలు విజయనగరాధీశులందరిలోకీ చాలా గొప్పవాడు, గొప్ప రాజనీతిజ్ఞుడు, సైనికాధికారి, భుజబల సంపన్నుడు, ఆర్థిక వేత్త, మత సహనము కలవాడు, వ్యూహ నిపుణుడు, పట్టిన పట్టు విడువని వాడు, కవి పోషకుడు, రాజ్య నిర్మాత మొదలగు సుగుణాలు కలవాడు. ఇతను దక్షిణ భారతదేశం మొత్తం ఆక్రమించాడు. కృష్ణదేవరాయలు స్వయంగా కవిపండితుడు కూడా కావడంతో ఇతనికి సాహితీ సమరాంగణ సార్వభౌముడు అని బిరుదు. ఈయన స్వయంగా సంస్కృతంలో జాంబవతీ కళ్యాణము, మదాలసాచరితము, సత్యవధూపరిణయము, సకలకథాసారసంగ్రహము, జ్ఞానచింతామణి, రసమంజరి తదితర గ్రంథములు, తెలుగులో ఆముక్తమాల్యద లేక గోదాదేవి కథ అనే గ్రంథాన్ని రచించాడు. "తెలుగదేల యన్న దేశంబు తెలుగేను తెలుగు రేడ నేను తెలుగొకొండ ఎల్ల జనులు వినగ ఎరుగవే బాసాడి దేశభాష లందు తెలుగు లెస్స" అన్న పలుకులు రాయలు వ్రాసినవే. రాయల ఆస్థానానికి భువన విజయము అని పేరు. భువనవిజయంలో అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, మాదయ్యగారి మల్లన (కందుకూరి రుద్రకవి), అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, రామరాజభూషణుడు (భట్టుమూర్తి), తెనాలి రామకృష్ణుడు అనే ఎనిమిది మంది కవులు ఉండేవారని ప్రతీతి. వీరు అష్టదిగ్గజములుగా ప్రఖ్యాతి పొందారు."తెలుగదేల యన్న దేశంబు తెలుగేను,తెలుగు వల్లభుండ తెలుగొకండ,యెల్ల నృపులు గొలువ యెఋగ వే బాసాడి,దేశ భాషలందు తెలుగు లెస్స.."అని మన తెలుగు భాషను కీర్తించిన తెలుగు వల్లభుడు, ఆంధ్ర భోజుడు,విజయనగర సామ్రాజ్య చక్రవర్తి, సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు. కృష్ణదేవ రాయలు తక్కిన విజయనగర రాజులలాగే వైష్ణవుడు. కానీ పరమతసహనశీలుడు. అనేక వైష్ణవాలయాలతో పాటు శివాలయాలను నిర్మించాడు. అంతేకాక ధూర్జటి, నంది తిమ్మన వంటి పరమశైవులకు కూడా తన సభలో స్థానం కల్పించాడు. అనేక దాన ధర్మాలు చేసాడు. ముఖ్యంగా తిరుమల శ్రీనివాసులకు పరమ భక్తుడు, సుమారుగా ఏడు పర్యాయములు ఆ దేవదేవుని దర్శించి, అనేక దానధర్మాలు చేశాడు. ఇతను తన కుమారునికి తిరుమల దేవ రాయలు అని, కుమార్తెకు తిరుమలాంబ అని పేర్లు పెట్టుకున్నాడు. కృష్ణదేవ రాయలు చెన్నకేశవస్వామి వారి దేవాలయం కట్టించాడు. కృష్ణదేవ రాయలుకు తిరుమల దేవి, చిన్నాదేవి ఇద్దరు భార్యలని లోక విదితము. కానీ, ఆముక్తమాల్యద ప్రకారం ఈయనకు ముగ్గురు భార్యలు (తిరుమలాదేవి, అన్నపూర్ణ, కమల). కృష్ణదేవరాయలు విజయనగర సామంతుడైన శ్రీరంగపట్నం రాజు కుమార వీరయ్య కూతురు తిరుమలాదేవిని 1498లో వివాహం చేసుకున్నాడు. పట్టాభిషిక్తుడైన తర్వాత రాజనర్తకి అయిన చిన్నాదేవిని వివాహమాడాడని ప్రతీతి. ప్రతాపరుద్ర గజపతిని ఓడించి, ఆయన కూతురైన తుక్కా దేవిని మూడవ భార్యగా స్వీకరించాడటనటానికి చారిత్రకాధారాలున్నాయి. ఈమెనే కొందరు లక్ష్మీదేవి అని, జగన్మోహిని అని కూడా వ్యవహరించారు. చాగంటి శేషయ్య, కృష్ణరాయలకు అన్నపూర్ణమ్మ అనే నాలుగవ భార్య ఉందని భావించాడు. కానీ, చిన్నాదేవే అన్నపూర్ణమ్మ అని కొందరి అభిప్రాయం. డొమింగో పేస్ ప్రకారం కృష్ణరాయలకు పన్నెండు మంది భార్యలు. కానీ అందులో తిరుమలాదేవి, చిన్నాదేవి, జగన్మోహిని ప్రధాన రాణులని చెప్పవచ్చు.అయితే శాసనాల్లో ఎక్కువగా ప్రస్తావించబడిన తిరుమలాదేవి పట్టపురాణి అయిఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం ఇద్దరు కుమార్తెలు, వారిలో పెద్ద కూతురు తిరుమలాంబను ఆరవీడు రామ రాయలకు, చిన్న కూతురును రామ రాయలు సోదరుడైన తిరుమల రాయలుకు ఇచ్చి వివాహం చేసాడు. ఒక్కడే కొడుకు, తిరుమల దేవరాయలు. ఇతనికి చిన్న తనంలోనే పట్టాభిషేకం చేసి, తానే ప్రధానిగా ఉండి రాజ్యవ్యవహారాలు చూసుకునేవాడు. కాని దురదృష్టవశాత్తూ తిరుమల దేవ రాయలు 1524లో మరణించాడు. ఈ విషయంపై కృష్ణ దేవ రాయలు తిమ్మరుసును అనుమానించి, అతనిని గ్రుడ్డివానిగా చేసాడు. తానూ అదే దిగులుతో మరణించినాడని ఓ అభిప్రాయము. మరణానికి ముందు చంద్రగిరి దుర్గమునందున్న సోదరుడు, అచ్యుత రాయలును వారసునిగా చేసాడు. శ్రీ కృష్ణ దేవరాయలు మతము దృష్ట్యా విష్ణు భక్తుడు అని అయన వ్రాసిన ఆముక్తమాల్యద తెలుపుచున్నది. అయితే శ్రీ కృష్ణ దేవరాయలు ఏ కులానికి చెందినవాడు అనే విషయంపై సాహిత్యవేత్తల్లోను, చరిత్రకారుల్లోను భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. శ్రీ కృష్ణ దేవరాయల తండ్రియైన తుళువ నరస నాయకుడు బంటు అనే నాగవంశపు క్షత్రియ కులానికి చెందినవాడని కొన్ని చరిత్ర పుస్తకాలు తెలుపుచున్నవి. శ్రీ కృష్ణ దేవరాయల తల్లి పేరు నాగలాదేవి. ఆముక్తమాల్యదలోని 19వ పద్యము ప్రకారము శ్రీ



కృష్ణ దేవరాయలు చంద్రవంశమునకు చెందినవాడని, 22-23-24 పద్యాల ప్రకారం శ్రీ కృష్ణ దేవరాయల ముత్తాత అయిన తిమ్మరాజు యయాతి వంశస్థుడు అని తెలుస్తున్నది. కొన్ని సాహిత్య పుస్తకాల్లో శ్రీకృష్ణదేవరాయలు కురూబు యాదవుడని రచయితలు వ్రాశారు. ఇందుకు అష్ట దిగ్గజాలలో ఒకరైన తిమ్మన రచించిన పారిజాతాపహరణంలో, శిలాశాసనాలలో లిఖించబడినది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన పాలకుడు శ్రీ కృష్ణదేవరాయులు మరణంపై ఆది నుంచి అనుమానాలే. ఆయన గతించిన తేదీపై ఎలాంటి క్లారిటీ లేదు. కానీ తాజాగా కర్నాటకలోని ఓ చారిత్రక శాసనంలో కృష్ణదేవరాయల మరణతేదీపై సందిగ్ధం వీడింది. కర్ణాటకలోని తుమకూర్ జిల్లాలోని ఒక ఆలయంలో బయటపడ్డ శాసనం. ఈ శాసనం ప్రకారం కృష్ణదేవరాయలు అక్టోబర్ 17,1529న తుదిశ్వాస విడిచారని తేలింది.

## పెరుగుతున్న క్రిప్టో కరెన్సీ మోసాలు



(మొదటిపేజీ తరువాయి)

లోన్ తీసుకొని, క్రెడిట్ కార్డు ద్వారా డబ్బులు చెల్లించి మోసపోయారు. ఇప్పుడు ఆ అప్పులు తీర్చలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. అయితే మంజీరా మాల్ లోని 11వ అంతస్తులో ఈ కంపెనీ ఉండగా.. ప్రస్తుతం మూసేసి ఉంది. డబ్బులు తీసుకున్న యాజమాన్యం చెప్పా పెట్టకుండా పారిపోయింది. మోసపోయినట్లు గుర్తించిన బాధితులకు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాజాగా సైబర్ క్రైమ్ బాదితులను పట్టించుకోకుండా పోలీసులు, అధికారులు నిందితులకు సపోర్ట్ చేస్తున్నారని మానవ హక్కుల సంగాన్ని ఆశ్రయించారు పలువురు బాధితులు. హైదరాబాద్ లోని ఎల్బీనగర్ కు చెందిన చెంద్రశేఖర్, సుమ దంపతులు. వీరిద్దరూ... నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకొని మోసాలకు పాల్పడుతూ ఉంటారు. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని బెంగుళూరులో టీసీఎస్ లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్తూ అందినకాడికి దండుకుంటారు. ఆపై ఫోన్లు స్విచ్చాఫ్ చేసి మొహం చాటేస్తారు. అయితే ఆన్ లైన్ ద్వారా ఇలా మాయ మాటలు చెప్తూ లక్షలు కాజేస్తున్న ఈ జంట.. ఇప్పటి వరకు పలువురు నిరుద్యోగ యువతీ యువకుల నుంచి 40 లక్షల వరకు దోచేశారు. అయితే తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు రాష్ట్ర మానవహక్కుల కమిషన్ ను ఆశ్రయించారుహెచ్ఆర్సీ కంటే ముందే బాధితులు ఎల్బీనగర్ పోలీసులకు పిర్యాదు చేశారు. అయితే వారు తమను పట్టించుకోకుండా.. నిందితులతో కుమ్మక్కై తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే తాము హెచ్ఆర్సీని ఆశ్రయించినట్లు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకొని.. తమ డబ్బులు తమకు తిరిగి వచ్చేలా చేయమని అధికారులను వేడుకుంటున్నారు. అలాగే బాధితుల పక్షాన నిలబడి న్యాయం చేయాల్సిన పోలీసులే నిందితులకు వత్తాసు పలకడం సరికాదని, ఈ కేసులో ఎల్బీ నగర్ పోలీసులను కూడా విచారించాలని కోరారు. హైదరాబాద్ గాంధీ నగర్ కు చెందిన శ్రీనివాస్ ఫోన్ నెంబర్ ను గుర్తు తెలియని వ్యక్తులు టెలిగ్రామ్ గ్రూపులో యాడ్ చేశారు. తాము చెప్పినట్లు చేస్తే తక్కువ సమయంలోనే కోటీశ్వరులు కావొచ్చంటూ వల విసిరారు. ఏం చేయాలంటూ అడిగిన పాపానికి శ్రీనివాస్ ను నిండా ముంచేశారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడ్తే.. చాలా లాభాలు వస్తాయని, తక్కువ సమయంలోనే కోటీశ్వరులు అవ్వొచని చెప్పారు. దీంతో 10, 20, 80 వేలు పెట్టుకుంటూ పోయాడు శ్రీనివాస్. ఆ తర్వాత ఒకేసారి 2 లక్షల 50 వేలు పెట్టాడు. దీనికి లాభాలు కనిపించాయి. తీసుకునేందుకు వీలు లేకుండా డబ్బును సైబర్ నేరగాళ్లు ఫ్రీజ్ చేశారు. లాభాలు వస్తున్నాయి కదా అని అత్యాశకు పోయి పలు దఫాలుగా 27 లక్షల రూపాయలను పెట్టాడు. అయితే అందులోంచి ఒక్క రూపాయి కూడా తీసుకునేందుకు రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. ఏం చేయాలో పాలుపోక వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ క్రైమ్ ఏసీపీ కేవీఎం ప్రసాద్ ను కలిసి జరిగిన విషయమంతా వివరించాడు. తనకు ఎలాగైనా న్యాయం చేయాలని కోరాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## త్రిపురలో ముగిసిన పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

అంతా మారిపోయింది. ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించాలని చూస్తున్న బీజేపీ ఓటర్లపై హామీల వర్షం కురిపించింది. అనుకూల్ చంద్ర స్కీమ్‌లో భాగంగా రూ.5 కే అందరికీ భోజనం అందిస్తామని హామీ ఇచ్చారు జేపీ నడ్డా. గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు అభివృద్ధి విషయంలో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. ఈ సారి మేనిఫెస్టోలో మరెన్నో ఆసక్తికరమైన అంశాలు చేర్చామని, అవన్నీ అభివృద్ధికి తోడ్పడేవే అని చెప్పారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తి చూపుతారని చెప్పిన నడ్డా...యువతను వృద్ధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు వివరించారు. మేనిఫెస్టోని ఉద్దేశిస్తూ "ఇది కేవలం కాగితం కాదు. ప్రజల పట్ల మాకున్న నిబద్ధతకు నిదర్శనం" అని తేల్చి చెప్పారు నడ్డా. ఒకప్పుడు త్రిపుర పేరు చెబితే హింసాత్మక వాతావరణమే గుర్తొచ్చేదని... ఇప్పుడు ఈ రాష్ట్రం శాంతి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.

## ఆధునిక హంగులతో మానేరు ఫ్రంట్

**హైదరాబాద్ :**

యావత్ ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా ఆధునిక హంగులతో మానేరు ఫ్రంట్‌ను నిర్మిస్తున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మానేరు వంతెనపై రూ.6.5కోట్లతో ఏర్పాటు చేయనున్న డైనమిక్ లైటింగ్ సిస్టమ్ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంతెనెకు హంగులు తీసుకువచ్చేందుకు డైనమిక్ లైటింగ్ సిస్టమ్ పనులను ప్రారంభించుకోనున్నట్లు పేర్కొన్నారు.త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.ఈ వాటర్ ఫౌంటెన్‌లు ప్రపంచవ్యాప్తంగా మూడు దేశాల్లో మాత్రమే ఉన్నాయన్నారు.

# యువతతో లోకేష్ ముఖాముఖి

**సత్యవేడు**

సత్యవేడు నియోజకవర్గం రాయపేడు విడిది కేంద్రంలో హలో లోకేష్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నేత నారా లోకేష్ సత్యవేడు నియోజకవర్గం యువతతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు.

లోకేష్ మాట్లాడుతూ జగన్ పాలనలో ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగప్రదేశ్ గా మారిపోయింది. జగన్ ప్యాలస్ లో ఉన్నారు. రాష్ట్ర యువత నడి రోడ్డు మీద ఉన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించాం. స్వయం ఉపాధిని ప్రోత్సహించామని అన్నారు. ఇప్పుడు ప్రతి ఏడాది 6500 పోలీసు ఉద్యోగాలు భర్తీ చేస్తాం అని మోసం చేశారు.డిఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ చేస్తాం అన్నారు. ఒక్క టీచర్ పోస్టు భర్తీ చెయ్యలేదు. ప్రత్యేక హోదా వేస్తే ఉద్యోగాలు వస్తాయని జగన్ అన్నారు. ఢిల్లీ ని గడగడలాడిస్తా అని అన్నారు. 25 ఎంపీలను ఇస్తే కేంద్రం మెడ వంచి హోదా తెస్తా అన్నారు. ప్రజలు లోక్ సభ , రాజ్యసభ లో కలిపి 31 మంది ఎంపీలను ఇచ్చారు. ఢిల్లీ అనేక సార్లు వెళ్ళారు. ఒక్క సారి కూడా ప్రధాని గారిని ప్రత్యేక హోదా గురించి అడగలేదు. గుడ్డు, కోడి థియరీ చెప్పే చేతగాని ఇండస్ట్రీస్ మంత్రి ఉండటం మన ఖర్మ. జగన్ కు అవగాహన లేకపోవడం, మంత్రి చేతగాని వ్యక్తి కావడం వలనే కంపెనీలు రావడం లేదు. టిడిపి హయాంలో కియా లాంటి పెద్ద కంపెనీలు ఎన్నో వచ్చాయి. ఒక్క ఫాక్స్ కాన్ అనే సంస్థలో 14 వేల మంది మహిళలు పని చేస్తున్నారు. ఇప్పుడు రాష్ట్రానికి కంపెనీలు ఎందుకు రావడం లేదో జగన్, మంత్రి అమర్నాథ్ సమాధానం చెప్పాలి. దర్శి లో కిరణ్ కుమార్ అనే యువకుడు ఇంజనీరింగ్ చదివి ఉద్యోగం లేక ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి ఏడాది నోటిఫికేషన్ ఇస్తాం. పరీక్ష నుండి నియామకం వరకూ తేదీలు ముందే ప్రకటిస్తాం. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా అదే రోజుల్లో నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేపడతామని అన్నారు.

బాబు అంటే బ్రాండ్ జగన్ అంటే జైలు. సైకో పోయి సైకిల్ పాలన వచ్చిన వెంటనే రాష్ట్రం నుండి వెళ్లిపోయిన అన్ని అన్ని కంపెనీలు తిరిగి వస్తాయి. రాయలసీమ యువత ను జగన్ వంచించాడు. అమరరాజా పక్క రాష్ట్రానికి పోయింది. 20 వేల మంది రాయలసీమ యువతకు ఉద్యోగ అవకాశాలు పోయాయిరిలయన్స్ ఎలక్ట్రానిక్స్ తయారీ కంపెనీ కి ఇచ్చిన భూమి వెనక్కి తీసుకున్నారు. దానితో ఆ కంపెనీ వెనక్కి పోయింది. సుమారుగా 50 వేల మంది రాయలసీమ యువత ఉద్యోగాలు కోల్పోయారు. టిడిపి అధికారంలోకి రాగానే వివిధ కార్పొరేషన్లను ప్రక్షాళన చేసి యువత కి పెద్ద ఎత్తున స్వయం ఉపాధి కి పెద్దపీట వేస్తాం. ఒక్క చిత్తూరు జిల్లాలోనే లక్ష మందికి ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉంది.

టీచర్ పోస్టులు, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయకపోగా, పాఠశాలల విలీనం అంటూ పోస్టులు తగ్గించి విద్యా వ్యవస్థను నాశనం చేశారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలను వేధిస్తున్నారు. 10 ఏళ్లకు ఒక సారి అనుమతులు రెన్యువల్ చేసుకోవాలి అనే నిభందనలు మార్చి మూడేళ్లకోసారి అనుమతులు రెన్యువల్ చేసుకోవాలి అంటూ వేధిస్తున్నారు. టిడిపి గెలిస్తే అనుమతుల కోసం పాత 10 ఏళ్ల విధానాన్ని తీసుకొస్తామని అన్నారు.టిడిపి అధికారంలోకి రాగానేవిద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకు వస్తాం. కేజీ టూ పీజీ సిలబస్ లో మార్పులు తెచ్చి ఉద్యోగాల అవకాశాలు వచ్చే విధంగా విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం. ఏపిపిఎస్సి ని వైసిపి భ్రష్టు పట్టించింది. జిఓ 77 తీసుకొచ్చి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, విదేశీ విద్య జగన్ కట్ చేశారు. టిడిపి గెలిచిన వెంటనే రెండు పథకాలు అమలు చేస్తాం. జగన్ ఎత్తేసిన నిరుద్యోగ భృతి పథకాన్ని మళ్ళీ ప్రారంభిస్తామని అన్నారు.విద్యా దీవెన, వసతి దీవెన అందక తల్లిదండ్రులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు, తదితర అంశాల పై టిడిపి పోరాటం కొనసాగుతూనే ఉంది. 4 ఎంపీలే ఉన్నా లోక్ సభ, రాజ్య సభ లో మా గళం వినిపిస్తున్నాం. నిరుద్యోగం, పేదరికం లేని రాష్ట్రం కోసం కృషి చెయ్యాలి అనేది మా లక్ష్యమని అన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# లోకేష్ వర్సెస్ రోజా...

**తిరుపతి :**



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, ఏపీ పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఏపీ సీఎం జగన్ వర్సెస్ లోకేష్ వర్సెస్ గా ఉన్న రాజకీయం, తాజాగా లోకేష్ వర్సెస్ రోజాగా మారుతోంది. తనపై చేస్తున్న విమర్శలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంత్రి రోజాను డైమాండ్ రాణి, జబర్దస్త్ ఆంటీ అని లోకేష్ చేసిన వ్యాఖ్యలు వైసీపీ శ్రేణుల్లో అగ్గి రాజేశాయి. నగరిలో ఓవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ శ్రేణులు ఆందోళనకు దిగుతున్నాయి.మంత్రి రోజా సైతం నారా బ్రాహ్మణి, నారా భువనేశ్వరిపై వ్యాఖ్యలు చేయడంతో వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లు అయింది. మంగళవారం నాడు టీడీపీ మహిళా నేతలు నగరిలో రోజా ఇంటి వద్దకి వెళ్లి చీర, గాజులు., పసుపు కుంకుమ ఇచ్చే ప్రయత్నం చేశారు. దీంతో మంత్రి రోజా ఇంటి వద్ద కొంతసేపు హైడ్రామా నడిచింది. అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని టీడీపీ నాయకులను అక్కడ నుంచి పంపివేశారు. బుధవారం ఉదయం మరోసారి టీడీపీ, వైసీపీ క్యాడర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ మాటల యుద్ధం మొదలైంది.ఈ తరుణంలో వైసీపీ మహిళా నాయకురాళ్లు ఒక్కడుగు ముందుకు వేసి ఖబర్దార్ లోకేష్, భాను ప్రకాష్.. మమ్మల్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే యువగళం పాదయాత్రను అడ్డుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీ నాయకులు మహిళలు నగిరి టవర్ క్లాక్ సర్కిల్ వద్ద ఆందోళనకు దిగి ధర్నా కార్యక్రమం చేపట్టారు. మంగళవారం జరిగిన సంఘటనపై మంత్రి రోజా ఇంటి వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు పసుపు, చీరలు గాజులు ఇవ్వడంపై వైసీపీ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ మహిళా నేతలు అంతటితో ఆగక నగిరి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భాను ప్రకాష్, లోకేష్ చిత్రపటాలపై చీపుర్లతో, చెప్పులతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. మా జోలికొస్తే ఖబర్దార్ లోకేష్, భాను ప్రకాష్ అంటూ సవాల్ విసిరారు. మంత్రి రోజా ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో భాను ప్రకాష్ పసుపు, చీర పంపడంపై మహిళా నాయకురాలు మేరీ జయరాం మండిపడ్డారు. ఎలాంటి మేనిఫెస్టోలు తెలియని, సరిగ్గా తెలుగు కూడా రాని నేత నారా లోకేష్ అంటూ ఎద్దేవా చేసారు. దమ్ముంటే చంద్రబాబు నాయుడు మా మంత్రి రోజా గారిపై గెలిచి చూపాలని సవాల్ చేశారు. నగిరి నియోజకవర్గంలో భాను ప్రకాష్ ని కాలు కూడా పెట్టరాని పరిస్థితి ఎదురవుతుందని, మాటలు జాగ్రత్తగా రావాలంటూ తీవ్రంగా మండిపడ్డారు. లోకేష్, నగిరి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భాను ప్రకాష్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టడంతో ఆ చిత్రపటాన్ని వైసీపీ శ్రేణులు కాల్చివేశారు.మరోవైపు యువగళం పాదయాత్రలో భాగంగా సత్యవేడు నియోజకవర్గంలో నారా లోకేష్ పర్యటిస్తున్నారు. పిచ్చాటూరులో ఆర్టీసీ బస్సు ఎక్కి, టీడీపీ ప్రభుత్వంలో, వైసీపీ పాలనలో ఆర్టీసీ ఛార్జీల మధ్య వ్యత్యాసాన్ని ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు లోకేష్. పేదలు, మధ్యతరగతి వారు ప్రయాణించే ఆర్టీసీ ఛార్జీలను వైసీపీ ప్రభుత్వం మూడు సార్లు పెంచి ప్రజలపై విపరీతమైన భారం వేసిందని లోకేష్ విమర్శించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆ తర్వాత గాలికి వదిలేశారని, ఆర్టీసి సిబ్బందికి రావాల్సిన ప్రయోజనాలు ఏపీ వారికి ఇంతవరకు దక్కలేదని ఏపీ ప్రభుత్వంపై లోకేష్ విమర్శలు చేశారు.

# శివరాత్రికి టూరిజం ప్యాకేజీ

**హైదరాబాద్ :**

తెలంగాణలోని ప్రముఖ శైవ క్షేత్రాల సందర్శన కోసం వెళ్లే భక్తులకు టూరిజం శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయాలకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలు అందిస్తోంది. శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం వెళ్లాలనుకునే వారి కోసం టూరిజం టూర్ ప్యాకేజీలను అందిస్తోంది. హైదరాబాద్ నుంచి ఈ టూర్ ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. టూరిజం ఏసీ బస్సు ద్వారా శ్రీశైలం టూర్ ప్యాకేజీని అందిస్తోంది. ఇది రెండు రోజుల పాటు సాగుతుంది. మొదటి రోజు ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి నేరుగా సాయంత్రం 5 గంటలకు శ్రీశైలం చేరుకుంటుంది. శ్రీశైల సాక్షి గణపతి ఆలయాన్ని సందర్శించుకున్న అనంతరం.. మల్లికార్జున స్వామి దర్శనం ఉంటుంది. రెండో రోజు పాతాళ గంగ, పాలధార, పంచధార, శిఖరం, ఆనకట్టలను రోప్‌వే ద్వారా సందర్శిస్తారు. ఆ తర్వాత తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. రాత్రి 7 గంటలకు హైదరాబాద్ చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది. ఈ టూర్ ప్యాకేజీ ధర పెద్దలకు రూ.2400, పిల్లలకు రూ.1920.కాళేశ్వరం వన్ డే టూర్ ప్యాకేజీని అందిస్తుంది. ఉదయం 5 గంటలకు బయలుదేరి 8 గంటలకు వరంగల్‌లోని హోటల్‌కు చేరుకుంటుంది. అల్పాహారం తర్వాత రామప్పలోని రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తారు. ఆ తర్వాత మేడిగడ్డ బ్యారేజీ, కానేపల్లి పంప్ హౌస్‌లను సందర్శించవచ్చు. సాయంత్రం 4 గంటలకు కాళేశ్వర ఆలయ దర్శనం ఉంటుంది. ఆ తర్వాత తిరుగు ప్రయాణం ప్రారంభమవుతుంది. రాత్రి 11 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ టూర్ ప్యాకేజీ శనివారం, ఆదివారం అందుబాటులో ఉంటుంది. ఈ టూర్ ప్యాకేజీ ధర పెద్దలకు రూ.రూ.1850. పిల్లలకు రూ.1490వేములవాడకు వన్ డే టూర్ ప్యాకేజీని అందిస్తోంది. ఉదయం 7 గంటలకు హైదరాబాద్ నుంచి బయల్దేరతారు. కొమురవల్లి మల్లికార్జున స్వామి ఆలయ సందర్శన అనంతరం.. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని కొండగట్టుకు వెళ్తారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన తర్వాత తిరుగు ప్రయాణం స్టార్ట్ అవుతుంది. రాత్రి 8 గంటలకు హైదరాబాద్ చేరుకుంటారు. ఈ టూర్ ప్యాకేజీ శనివారం, ఆదివారం అందుబాటులో ఉంటుంది. ఈ టూర్ ప్యాకేజీ ధర పెద్దలకు రూ.1200. పిల్లలకు రూ.960.

# తెలంగాణలో జై శ్రీరామ్ నినాదం

**హైదరాబాద్ :**

తెలంగాణ రాజకీయం హిందుత్వం చుట్టూ తిరుగుతోందా? ఉన్నట్టుండి అన్ని పార్టీలు జై శ్రీరామ్ నినాదం ఎందుకు ఎత్తుకుంటున్నాయి.? ఈ విషయంలో ఎవరి వ్యూహం ఏంటి..? ఆసక్తికర వివరాలు మీకోసం.. తెలంగాణలో ఎన్నికల మూడ్ వచ్చేసినట్లే కనిపిస్తోంది. టైమ్ దగ్గరపడుతున్న కొద్దీ ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి.! హిందుత్వ ఎజెండాను వేగంగా ట్రాక్‌పైకి ఎక్కిస్తున్నాయి. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో ఉన్న రేవంత్ రెడ్డి భద్రాచలం శ్రీరాముడి ఆలయం సాక్షిగా కీలక కామెంట్స్ చేశారు. అధికారంలోకి వస్తే వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో వెయ్యి కోట్లతో రాముడి ఆలయాలు కట్టిస్తామన్నారు.బీజేపీని ఎదుర్కొనేందుకే కాంగ్రెస్ హిందూత్వ అజెండాను తెరపైకి తెస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ ఇష్యూలో బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య వార్ జరుగుతోంది. హిందుత్వం పేటెంట్‌గా దూసుకెళ్తున్నారు కమలనాథులు.. అటు సీఎం కేసీఆర్ కూడా ఆలయాల అభివృద్ధిపై ఫోకస్ చేస్తున్నారు. ఇప్పటికే యాదాద్రిని పూర్తిచేశారు. ఇప్పుడు కొండగట్టుపై దృష్టిపెడుతున్నారు. 600 కోట్లతో దేశంలోనే అతిపెద్ద హనుమాన్ క్షేత్రాన్ని నిర్మిస్తామని ప్రకటించారు. బీజేపీ, బీఆర్ఎస్ కి పోటీగా ఇప్పుడు కాంగ్రెస్ కూడా హిందుత్వ నినాదం ఎత్తుకుంటోంది. నియోజకవర్గానికి ఓ రాముడి గుడి అనే కాన్సెప్ట్ అందులో భాగమే అంటున్నారు..హిందుత్వ విషయంలో బీజేపీ వ్యూహం వెరీ క్లియర్. జైశ్రీరామ్ నినాదం విషయంలో వెనక్కితగ్గేది లేదని ఇప్పటికే స్పష్టం చేసింది.. మెజార్టీనే తమ ఓటు బ్యాంకుగా మల్చుకొని ఆధిపత్యం చేలాయించాలని చూస్తోంది! అందుకే ఆలయాల అభివృద్ధితో గట్టిగా కౌంటర్ ఇస్తోంది బీఆర్ఎస్. ఇప్పుడు కాంగ్రెస్ కూడా ఇదే బాటలోకి వస్తోంది.

# ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్లు

**విజయవాడ :**



పర్యావరణంతో పాటు భూగర్భ జలాలకు ప్రమాదకరంగా తయారైన ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు సేకరించి.. వాటిని రోడ్ల నిర్మాణంలో ఉపయోగించేలా రీసైక్లింగ్ చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. నియోజకవర్గానికి ఒకచోట ఈ తరహా రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేయబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా 160 గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు గ్రామాల ఎంపిక సైతం పూర్తయింది.పట్టణాల తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రతి ఇంటినుంచీ నేరుగా చెత్త సేకరణ ప్రక్రియను ప్రభుత్వం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇలా సేకరించిన చెత్తను ఆయా గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న చెత్త సేకరణ కేంద్రాల (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల)లో ప్లాసిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరు చేసి ఉంచుతారు.గ్రామాల వారీగా ఇలా వేరు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను వారానికి ఒకటి లేదా రెండు విడతలుగా ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్‌కు తరలించేలా ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేస్తారు. ప్రతివారం రూట్ల వారీగా ఆ వాహనంతో అన్ని గ్రామాల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తారు. అనంతరం ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను మెషిన్ల సాయంతో బండిల్స్ రూపంలో అణచివేసి.. ఆ తర్వాత చిన్నచిన్న ముక్కలు ముక్కలుగా మార్చి నిల్వ చేస్తారు. ప్లాస్టిక్ బాటిల్స్ వంటివి మట్టిలో కలవడానికి కనీసం 240 సంవత్సరాలు పడుతుంది. ఇలాంటి ప్లాస్టిక్ వ్యర్థాలు వర్షం నీటిని భూమిలో ఇంకిపోకుండా అడ్డుపడుతుంటాయి. దీనివల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో పీఎంజీఎస్‌వై (గ్రామీణ సడక్ యోజన) కింద చేపట్టే రోడ్ల నిర్మాణంలో కంకరతో పాటు కొంతమేర ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది.ప్లాస్టిక్ కవర్లు వంటి వాటిని సిమెంట్ పరిశ్రమలలో మండించడానికి ఉపయోగించేలా ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే రీసైక్లింగ్ యూనిట్లలో సిద్ధం చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్ల నిర్మాణంలో ఉపయోగించాల్సి ఉంటుంది.రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా రోడ్ల నిర్మించే కాంట్రాక్టర్లకు ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను విక్రయించే ఆలోచన చేస్తున్నారు. రానున్న రోజుల్లో రోడ్ల నిర్మాణంలో వీటి వాడకం పెరిగే పక్షంలో జిల్లాల వారీగా ప్రత్యేక వేలం కేంద్రాలను ఏర్పాటు చేసే ఆలోచన కూడా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా 2021 అక్టోబర్ నుంచి క్లీన్ ఆంధ్రప్రదేశ్ నినాదంతో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం కూడా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 232 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. వాటిలో స్థానికంగా అమ్మడానికి వీలున్న వాటిని గ్రామ పంచాయతీల స్థాయిలోనే చిరు వ్యాపారులకు అమ్మేశారు.అమ్మకానికి పనికి రాని ప్లాస్టిక్ వ్యర్థాలను పర్యావరణానికి హాని కలిగించని రీతిలో నాశనం చేసినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి గ్రామాల్లో సేకరించే ప్లాస్టిక్ వ్యర్థాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా రోడ్ల నిర్మాణం లేదా సిమెంట్ పరిశ్రమలో మండించడానికి ఉపయోగించేలా రీసైక్లింగ్ ప్రాసెస్ చేయనున్నట్టు పంచాయతీరాజ్ శాఖ అధికారులు వెల్లడించారు.

# క్యాపిటల్ కహానీకి ఫుల్ స్టాప్ ఎప్పుడు

**విజయవాడ :**

రాజధాని వ్యవహారం సర్దుమణిగింది అనుకున్న ప్రతిసారీ ఏదో రూపంలో రాజుకుంటూనే ఉంది. తాజాగా బెంగళూరులో ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కేపిటల్ సిటీపై చేసిన వ్యాఖ్యలు ఈసారి దుమారాన్ని రేపుతున్నాయి. కర్నూలు, గుంటూరు రాజధాని కాదని.. విశాఖపట్నం రాజధానిగా నిర్ణయించామన్నారు బుగ్గన. వెంటనే లైన్‌లోకి వచ్చిన విపక్షాలు అంటే మూడు రాజధానులు కూడా మీ విధానం కాదా అంటూ విమర్శల బాణాలు ఎక్కుపెట్టాయి. మా విధానం మూడు రాజధానులే చట్టం కూడా తీసుకొస్తామని సజ్జల రామకృష్ణారెడ్డి క్లారిటీ ఇచ్చేశారు. అయినా సవాళ్లు మాత్రం కొనసాగుతున్నాయి.మూడు రాజధానులే మా విధానం అని బిల్లు పెట్టినప్పుడు.. అనంతరం సాంకేతిక కారణాలతో వికేంద్రీకరణ చట్టం రద్దు చేసినప్పుడు గంటల కొద్దీ అసెంబ్లీలో ప్రసంగించిన ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ లేటెస్టుగా బెంగళూరులో చేసిన హాట్ కామెంట్స్ ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారింది.త్రీ కేపిటల్స్ సమాచారలోపమని.. రాజధానిగా విశాఖనే నిర్ణయించామని బుగ్గన చెప్పిన ఒక్క మాటను ఏపీలోని విపక్షాలు ఆయుధంగా మలుచుకున్నాయి. ఇంతకాలం మూడు రాజధానులు అంటూ మూడు ప్రాంతాల్లో చెప్పిన వైసీపీ తన విధానంపైనా మడమతిప్పిందా అంటూ నోటికి పనిచెప్పారు. విశాఖ రాజధాని ఎవరూ కోరుకోవడం లేదంటున్న లెఫ్ట్ తో పాటు జనసేన పార్టీలు వైసీపీకి ఓపెన్ సవాల్ విసిరాయి.విధానం మారలేదు.. మూడు రాజధానులపై మా నినాదం కూడా మారదు అంటూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన సజ్జల.. మంత్రి బుగ్గన మాటలను సరిగ్గా అర్థం చేసుకోలేదన్నారు. మీరు సవాళ్లు చేయడం ఏంటి.. తమ ఎన్నికల అజెండాలో రాజధాని అంశం కూడా ఉంటుందని స్పష్టత ఇచ్చింది వైసీపీ. అంతేకాదు కోర్టు తీర్పులకు అనుగుణంగానే సీఎం విశాఖ వెళతారంటూ కూడా స్పష్టత ఇచ్చింది వైసీపీ.ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్న రాజధాని వ్యవహారం రాజకీయ పార్టీలకు ఆహారంగా మారింది. కేపిటల్ కహానీ సజీవంగా ఉంచి ఎంతోకొంత లబ్ధి పొందే ప్రయత్నంలో అన్ని పార్టీలున్నాయా? అనే విషయం తేలాల్సి ఉంది.

# మానసిక వికలాంగరాలిపై అత్యాచారం

**చెన్నై :**

ప్రస్తుత సమాజంలో కొందరు అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. మహిళల పట్ల కనీసం కనికరం లేకుండా ప్రవర్తిస్తున్నారు. కామవాంఛను తీర్చుకోవడం కోసం దిగజారి నేరాలకు పాల్పడుతున్నారు. అనాధాశ్రమం అని పెట్టి అబలలపై నిర్వాహకులు అత్యాచారాలకు పాల్పడిన అత్యంత అమానుషమైన ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. అనాధాశ్రమంలోని మానసిక వికలాంగ, భర్త కోల్పోయిన మహిళలపై వరుసగా అత్యాచారాలు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.లొంగని మహిళలను సంకెళ్లతో కట్టేసి వారిపైకి కోతులను ఉసిగొల్పి కరిపించారు. ఈ దారుణ ఘటన తమిళనాడు రాష్ట్రం విల్లుపురం జిల్లాలో చోటుచేసుకుంది. గుండల పులియూర్ గ్రామంలో ఉన్న అన్బు జ్యోతి అనాధాశ్రమంలోని మానసిక వికలాంగ మహిళలకు మత్తుమందిచ్చి రాడ్లతో దాడి చేసి నిర్వాహకులు అత్యాచారం చేశారు. ఆశ్రమంలో ఉన్న 142లో పురుషులు109 ఉంటే మహిళల 33 మంది.. వారిలో ప్రస్తుతం 16 మంది మిస్సింగ్ అయినట్లు గుర్తించిన రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించారు. తనకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేయడమేకాకుండా, ఇనుప సంకెళ్లతో కట్టేసి కోతులతో కరిపించారని ఒడిశాకు చెందిన మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసు, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. ఆశ్రమంలోని వారిని అధికారులు ఆసుపత్రికి తరలించారు. అక్రమాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన వెలుగులోకి రావడంతో నిందితులను కఠినంగా శిక్షించాలని మానవ హక్కుల సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కంటివెలుగును ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి

**మంథని**

తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని మంథని మండలం లోని గుంజపడుగులో గురువారం గుంజపడుగు ఎంపిటిసి సభ్యురాలు ఊదరి లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి కంటి పరీక్షలను చేయించుకున్నారు. అనంతరం ఎంపిటిసి ఊదరి లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ పేద ప్రజల కళ్ళల్లో వెలుగులు నింపే విధంగా, అందత్వ నివారణ కోసం చేపట్టిన కంటివెలుగు ను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇట్టి క్యాంపును ఫిబ్రవరి16 నుండి మార్చి9 నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గద్దలపల్లి వైద్య అధికారి డాక్టర్ సృజన్ కుమార్, వైద్య సిబ్బంది మెర్సీ మణి, కొండర శోభ, లీల, రమ, సంధ్య, శైలజ, శంకరమ్మ, గ్రామ కార్యదర్శి రత్నకుమార్ నాయకులు బానేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలంలో విశేష పూజలు

**శ్రీశైలం**

ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలం లో హాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరవ రోజైన గురువారం స్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపారు. సాయంకాలం పుష్పపల్లకీ సేవ, లోక కల్యాణం కోసం రుద్రహోమం, చండీహోమం, జపాలు, పారాయణలు జరిపారు. తరువాత శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం జరిగింది. ఆలయ దక్షిణమాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద, పుష్కరిణి వేదిక వద్ద, శివదీక్షా శిబిరాల వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## 16 నుంచి అగ్నివీరుల దరఖాస్తులు

**హైదరాబాద్**

ఆర్మీలో అగ్నివీరుల నియామకానికి తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 2023–24 కు సంబంధించి ఫిబ్రవరి 16 నుంచి అగ్నిపథ్ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల సమర్పణకు మార్చి 15 తుదిగడువు. అనంతరం ఏప్రిల్ 17 నుంచి ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత రాత పరీక్షలు ఉంటాయి. వీటిలో అర్హత సాధించిన వారికి శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. అభ్యర్థుల వడపోత అనంతరం నాలుగేళ్ల కాలానికి అగ్నివీరులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులు ఇండియన్ ఆర్మీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరింది.

## టీడీపీ నేతల గృహనిర్బంధం

**కడప**

టిడిపి, వైసిపి నేతల మధ్య సవాల్, ప్రతి సవాళ్ల నేపథ్యంలో కడపలో ఉద్రిక్తత నెలకొంది. టిడిపి నేతలు శ్రీనివాసులు రెడ్డి, హరిప్రసాద్ లను పోలీసులు హౌజ్ అరెస్టు చేసారు. వైసిపి నేతల సవాళ్లు విసరడంతోనే బహిరంగ చర్చకు సిద్ధమయ్యమని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసుల రెడ్డి అన్నారు. సెవెన్ రోడ్స్ లో బహిరంగ చర్చకు అనుమతించక పోతే.. మా ఇంటి దగ్గర కే వైసిపి నేతలను రమ్మనండి. మేము శాంతి భద్రతల సమస్య తీసుకు రావడం లేదు.. శాంతియుతంగా కడప నగర అభివృద్ధి పై చర్చిస్తామని అన్నారు..

## పంటలకు పగటిపూట కరెంట్ ఇవ్వండి

**ఐనవోలు**

టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి గురువారం ఐనవోలులోని 133 కేవి సబ్ స్టేషన్ లో ట్రాన్స్ కో ఏఈ తోట ఐలయ్య ను కలిసి వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై వివరాలు తెలుసుకున్నారు. ఏసీడీ, ఎఫ్ సీ ఏ చార్జీలు వసూలు చేయకూడదని మినిట్స్ లో రాసి అధికారులకు చెప్పాలని వివరించారు. రైతులకు కరెంట్ ఎప్పుడొస్తుందో వారం ముందే షెడ్యూల్ ఇవ్వాలని సూచించారు. రాత్రిపూత కరెంటుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. పగటిపూట కరెంటు ఇవ్వాలని అన్నారు. రేవంత్ సూచలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏఈ చెప్పారు. ఆరిటీజన్ కార్మికుల సమస్యలను ఉద్యోగి శ్రవణ్ రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనాలు, కార్మికులను పర్మినెంట్ చేసేలా చూడాలని వినతి చేసారు

## విద్యుత్ అధికారుల మెరుపు దాడులు

**పల్నాడు**

పల్నాడు జిల్లా గురజాల మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అధికారులు మెరుపు దాడులు జరిపారు. దాదాపు యాభై ప్రత్యేక బృందాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. దాడుల్లో పలువురు విద్యుతు చౌర్యం చేస్తున్నట్లు గుర్తించారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న 106 మందికి 5.41 లక్షలు అపరాధ రుసుం విధించారు.

## ఆలయ ప్రతిష్టాపనలో పాల్గొన్న మంత్రి

**సూర్యాపేట**

సూర్యాపేట మండలం యండ్ల పల్లి గ్రామంలో శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి ,కోదండరామ స్వామి సమేత ఆలయ ప్రతిష్టపన మహోత్సవం లో మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ రెడ్డి, జడ్పీటీసీ బిక్షం,ఇతర నాయకులు..గ్రామ ప్రజలు, భక్తులు పాల్గోన్నారు.

## జహీరాబాద్ లో కేంద్ర మంత్రి పర్యటన

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా లో కేంద్ర మంత్రి పరిషోత్తం రూపాల రెండో రోజు పర్యటన గురువారం కొనసాగింది. జహీరాబాద్ నియోజకవర్గం పర్యటనలో భాగంగా న్యాల్ కల్ మండలం గాంగ్వార్ లో భాజపా దళిత నాయకుడు మల్లేష్ ఇంట్లో కేంద్ర మంత్రి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం మండల భాజపా ముఖ్య నాయకులతో చిట్ చాట్ నిర్వహించారు. అక్కడి నుంచి నారాయణఖేడ్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు.

# టీడీపీ గూటికి శైలజానాథ్

**అనంతపురం :**



టీడీపీ నుంచి టికెట్ ఆశించే వారి సంఖ్య మాత్రం పెరిగిపోతోంది. అధినేత సైతం ఎవరైతే బాగుంటారనే సర్వేలు నిర్వహిస్తోంది. ఆ సర్వేల్లో కాంగ్రెస్ నుంచి చేరబోయే ఓ నేత టాప్‌లో ఉన్నారట. ఆ విషయం తెలిసి ఆ నాయకుడు ఇంకా దూకుడు పెంచారట.దేనికైనా టైం రావాలంటారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలో టీడీపీకి ఆ టైమ్ వచ్చిందన్నది తెలుగు తమ్ముళ్ల మాట. కేడర్ బలంగా ఉన్నా వాళ్లను నడిపించే బలమైన నాయకుడే లేడు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన బండారు శ్రావణికే కొన్నాళ్లు ఇంఛార్జ్ పగ్గాలు అప్పగించారు. ఆమె సారథ్యాన్ని వ్యతిరేకిస్తూ గొడవలు జరగడంతో టూమెన్ కమిటీ వచ్చింది. నర్సానాయుడు, కేశరెడ్డితో ఆ కమిటీ వేసినా.. ప్రస్తుతం కమిటీలో వీరిద్దరికీ పడటం లేదని తెలుస్తోంది. ఇంతకీ శ్రావణిని ఇంచార్జ్‌గా ఉంచారా లేదా అన్నది కేడర్‌కు క్లారిటీ లేదు. శింగనమల ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గమైనా.. ఇక్కడ టీడీపీని నడిపేది ఓసీ నేతలే అనే ముద్ర పడింది.మూడున్నరేళ్లుగా శింగనమల టీడీపీలో గొడవలే గొడవలు. నియోజకవర్గాల్లో పరిస్థితులు తెలుసుకొనేందుకు వన్ టు వన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు టీడీపీ అధినేత. శింగనమల విషయంలో అదే చేశారు. టూమెన్ కమిటీని, బండారు శ్రావణిని వేర్వేరుగా పిలిచి మాట్లాడారు. అదే సమయంలో టీడీపీ టికెట్ ఎవరికి ఇస్తే బాగుంటుంది అని టూమెన్ కమిటీని ప్రశ్నించారట పార్టీ అధినేత. ఆ సందర్భంగా ఏపీసీసీ మాజీ చీఫ్, మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌తోపాటు ఓ రిటైర్డ్ న్యాయమూర్తి పేర్లు చర్చల్లోకి వచ్చాయట.ఇప్పటివరకు శింగనమలలో ఉన్న టీడీపీ నేతలు ఓ ఎత్తు.. శైలజానాథ్ రాకతో మరో ఎత్తు అన్నట్టు ప్రచారం సాగుతోంది. శైలజానాథ్ టీడీపీలోకి వస్తున్నారని చాన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. ఆయన మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. గతంలో ఇదే శింగనమల నుంచి ఆయన రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఒకసారి మంత్రిగా పనిచేశారు కూడా. నియోజకవర్గంపై గ్రిప్ ఉండటంతో.. కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారట. అయితే పీసీసీ చీఫ్ అయిన తర్వాత శింగనమలను శైలజానాథ్ పెద్దగా పట్టించుకోలేదనే అభిప్రాయం ఉంది. పీసీసీ చీఫ్ పదవి కోల్పోయాక.. ఆయన దృష్టంతా నియోజకవర్గంపైనే ఉంది. ఈసారి ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో అందరినీ పలకరిస్తున్నారట. టీడీపీ అధినేత కూడా శింగనమలపై మూడునాలుగు సర్వేలు చేశారట. ఎవరిని అభ్యర్థిగా నియమించాలో లెక్కలు వేసుకున్నారట.అన్నీ అనుకున్నట్టు జరిగితే మార్చిలో శింగనమల టీడీపీకి కొత్త ఇంఛార్జ్ వస్తారని.. అలా వచ్చిన ఇంఛార్జే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారని చెబుతున్నారు. టీడీపీ టికెట్ రేస్‌లో శైలజానాథ్ ముందు వరసలో ఉన్నారట. ఆయన కాంగ్రెస్‌ను వీడి టీడీపీలో చేరకపోయినా.. అది లాంఛనమే అనేది స్థానిక తెలుగు తమ్ముళ్ల మాట. మరి.. శింగనమల టికెట్ మాజీ మంత్రికి ఇస్తారో లేక గత ఎన్నికల్లో ఓడిన శ్రావణినే ఎంపిక చేస్తారో.. వీళ్లెవరూ కాదని మాజీ న్యాయమూర్తిని పిలిచి పట్టం కడతారో చూడాలి.

# శ్రీ సిటీ నుంచి వందేభారత్ భాగాలు

**తిరుపతి :**

శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా పరిశ్రమ నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకు ఫైబర్ రీఇన్‌ఫోర్స్ ప్లాస్టిక్ (ఎఫ్ఆర్‌పీ) విడి భాగాలను సరఫరా చేస్తున్నారు. వైఎస్సార్ హయాంలో శ్రీసిటీలో తొలిసారిగా ఏర్పాటైన 8 పరిశ్రమల్లో బీఎఫ్‌జీ ఒకటి. బీఎఫ్‌జీ ఇంటర్నేషనల్ అనుబంధ సంస్థ అయిన బీఎఫ్‌జీ ఇండియా.. వందేభారత్ ఎక్స్‌ప్రెస్, దేశంలోని వివిధ మెట్రో ప్రాజెక్టులకు నాణ్యమైన, ప్రపంచస్థాయి ఎఫ్ఆర్‌పీ విడి భాగాలను అందిస్తోంది.శ్రీసిటీ సెజ్‌లో ఉన్న బీఎఫ్‌జీ ఇండియా 2009 నుంచి పవన శక్తి, నిర్మాణం, రవాణా వంటి వివిధ రంగాల్లో ఉన్న పరిశ్రమల కోసం ఎఫ్ఆర్‌పీ మిశ్రమ ఉత్పత్తులు, ప్రత్యేక ఆకృతుల నిర్మాణాలను తయారు చేస్తోంది. మెట్రోకోచ్ తయారీ సంస్థలు ఆల్స్‌టం, బొంబార్డియర్, వోల్వో, ఇండియన్ రైల్వేస్‌కి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ(ఐసీఎఫ్), జనరల్ ఎలక్ట్రికల్?ఎనర్జీ, గమేశ, కొచ్చిన్ షిప్ యార్డ్, థెర్మాక్స్, ఆర్సీఎఫ్, ఎంసీఎఫ్, బెచ్‌టెల్ వంటి సంస్థలకు బీఎఫ్‌జీ ఇండియా సేవలందిస్తోంది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్ట్‌లో రైలు పెట్టెలోని ఇంటీరియర్‌లు, టాయిలెట్ క్యాబిన్, ఇంజన్ ముందు భాగాన్ని బీఎఫ్‌జీ సంస్థే సరఫరా చేస్తోంది. ఇచ్చిన పనులను రికార్డు స్థాయిలో 10 నెలల్లో బీఎఫ్‌జీ పూర్తి చేసింది. ప్రాజెక్ట్‌ను ఆకర్షణీయంగా రూపొందించడానికి వివిధ రంగుల ప్యానెల్స్‌ను ఈ కంపెనీ తయారీ చేసింది. ఒక్కోరైలు కోసం 329 రకాల ఎఫ్ఆర్‌పీ ప్యానెల్స్ తయారయ్యాయ.ఢిల్లీ మెట్రో రోలింగ్ స్టాక్(కోచెస్) కోసం బొంబార్డియర్ ట్రాన్స్‌పోర్టేషన్‌తో దాని వ్యూహాత్మక సరఫరాదారుగా ఇంటీరియర్స్, ఫ్రంట్ ఎండ్‌లు, డ్రైవర్ క్యాబ్‌లతో సహా ఎఫ్ఆర్‌పీ విడి భాగాలను బీఎఫ్‌జీ ఇండియా సరఫరా చేస్తోంది. చెన్నై, కొచ్చి, మెట్రో ప్రాజెక్ట్‌ల మెట్రో రోలింగ్ స్టాక్ కోసం సైడ్ వాల్స్, సెంట్రల్ సీలింగ్‌లు, లేటరల్ సీలింగ్‌లు, గ్యాంగ్‌వే విభజనలు, క్యాబ్ విభజనలతో సహా వివిధ భాగాలను శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ ఇండియాకు బీఎఫ్‌జీ సరఫరా చేస్తోంది.

# విధులలో అలసత్వం వద్దు

**శ్రీశైలం**





శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల క్షణమే లక్ష్యంగా జిల్లా పోలీస్ యంత్రాంగం అన్ని రకాల ముందస్తు పటిష్ట చర్యలు చేపట్టమని, సుమారు 2,400 మంది పోలీసులతో పటిష్ట భద్రత చేపట్టమని నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి వెల్లడించారు. బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి మీకు కేటాయించిన ప్రదేశం లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా వుండాలని బ్రిఫింగ్ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ భద్రత ఏర్పాట్ల గురించి మాట్లాడుతూ శ్రీశైలం శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బందోబస్తుకు ఒక అడిషనల్ ఎస్పీ 13మంది డిఎస్పీలు ,52 మంది సిఐలు ,120 మంది ఎస్ఐలు, 954 మంది ఏఎస్ఐ మరియు హెడ్ కానిస్టేబుల్ , 106 మహిళా సిబ్బంది ,464 మంది హోంగార్డులు, 100 మంది స్పెషల్ పార్టీ బృందాలు, డాగ్ స్కాడ్ బృందాలు,మఫ్టీ పోలీస్ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. దైవదర్శనానికి వచ్చిన భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా విధులు నిర్వర్థించాలని బందోబస్తు విధులలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి తెలియజేసారు. ఎక్కడైనా సమస్య ఉన్నచో పోలీస్ సిబ్బంది సత్వరమే స్పందించాలని ఆదేశించారు ఆంధ్రప్రదేశ్ నుండే కాక కర్ణాటక మహారాష్ట్ర తెలంగాణ తమిళనాడు మొదలగు రాష్ట్రాల నుండి కూడా శ్రీశైలంనకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు.పాతాళ గంగ ఘట్ల దగ్గర స్నానం అనుసరించడానికి వచ్చే భక్తులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా గజ ఈతగాళ్లను నియమించామని తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ కు చెందిన వాహనాలను ఆర్టీసీ బస్ స్టాండ్ ప్రాంతంలో ,తెలంగాణ ,కర్నాటకకు చెందిన వాహనాలను మేకల బండ వెనక ప్రాంతంలో ,టూరిస్ట్ వాహనాలను మేకల బండ ప్రక్కన గల ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలని,కార్లకు టెంపుల్ వెనక భాగంలో ,ఓల్డ్ హెలిపాడ్ ,స్కూల్ మరియు నిత్య అన్నదాన ప్రక్కన ,కమ్మ సత్రం వెనకాల పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్. రమణ ,ఆత్మకూరు డిఎస్పి వై శృతి ,స్పెషల్ బ్రాంచ్ సిఐ దస్తగిరి బాబు బందోబస్తు వచ్చిన సిఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## సోము వీర్రాజుపై అసత్య ఆరోపణలు

**తిరుపతి**

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానంద్ గురువారం కదిరి పట్టణంలో మీడియాతో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజుపై ఆసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. వీర్రాజు 40 ఏళ్ళ రాజకీయ జీవితంలో అవగింజంత మచ్చలేని గొప్పవ్యక్తిని అన్నారు. న్యాయపరంగా వివాదరహిత భూమి విషయంలో ర్రాజు మీద నిందలేసారని అన్నారు. కొన్ని నకిలీ దళిత సంఘాల దిరింపులకు భయపడేది లేదని అన్నారు. రాజకీయ విమర్శలకు కూడా ఒక అర్థం ఉండాలని, ప్రధాని నరేంద్ర మోడీ రు వేల కోట్ల రూపాయలు ఈ రాష్ట్రం అభివృద్ధి కోసం కేటాయించి ఇస్తుంటే దాన్ని అడ్డుపడి రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం, కుల రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. వీర్రాజు రిపై వెనుకుండి బురద చల్లుతున్న వారి యొక్క దురుద్దేశం మాకు తెలుసని, చిన్నకాకాని లో ఉన్న భూమికి సోమూవీర్రాజు కి ఏమి సంబంధం అని ప్రశ్నించారు.

## కమలం కు కన్నా గుడ్ బై

**గుంటూరు**

మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ గురువారం నాడు బీజేపీకి రాజీనామా చేసారు. రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు పంపించారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కన్నా లక్ష్మీనారాయణ వున్నారు. గతంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసారు. కొంతకాలంగా రాష్ట్ర బీజేపీ వైఖరిపై కన్నా అసంతృప్తి వున్న సంగతి తెలిసిందే. తన అనుచరులతో అత్యవసరంగా సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేస్తున్న విధానాలు మంచిగా ఉన్న రాష్ట్ర బీజేపీ లో వ్యవహారాలు మాత్రం వ్యాపారపరంగా నడుస్తున్నాయి. ఈ కారణంతోనే బిజెపి పార్టీని వెళుతున్నానని అయన అంటున్నారు.

## మాయ మాటలు, మూటల సంచులతో గెలుస్తున్న కేసీఆర్

**నల్గొండ**

నల్లగొండ జిల్లా అనుముల కేంద్రంలో “హత్ సే హత్ జొడో యాత్ర”లో మాజీ సిఎల్పీ నాయకుడు జానారెడ్డి పాల్గోన్నారు. జానారెడ్డి మాట్లాడుతూ లక్షల ఎకరాలకు సాగునీరు అందించాను. కేంద్రంలో మోదీ, తెలంగాణలో కేసీఆరే పోలీసులతో బెదిరిస్తున్నారు. ఎలక్షన్ టైంలో మాయ మాటలు, ముటల సంచులతో వచ్చి కేసీఆర్ గెలుస్తున్నడు. దళితుల మూడెకరాల భూమి హామీ ఏమైంది..? నిరుద్యోగు బృతి రైతు రుణమాఫి ఏమైంది..? కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అరాచకాలు మోసాలను ప్రజలకు వివరించేందుకు ఈ యాత్ర ఉద్దేశ్యమని అన్నారు. అధికారం లేకున్నా మీకు అండగా నిలుస్తున్న. అనుముల గ్రామంలో ప్రజాశక్తి తో నేను చెక్ డ్యాం నిర్మిస్తాను. అనుముల గ్రామ ప్రజల దివెనతో రాష్ట్రనికి సేవ చేసే భాగ్యం నాకు దక్కిందని అన్నారు.

## కొండపోచమ్మ సాగర్ ను సందర్శించిన పంజాబ్ సీఎం

**సిద్దిపేట**

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలోని కొండపోచమ్మ సాగర్ ను పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ గురువారం సందర్శించారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్ కుమార్ అయనకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం తీరును వివరించారు.

భగవంత్ సింగ్ మాన్ మాట్లాడుతూ ఈ రోజు మీతో కలిసినందుకు చాలా సంతోషంగా ఉంది. ఢిల్లీలో చూసి ఇక్కడ బస్తీ దవాఖాన ప్రారంభించారు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఢిల్లీ వెళ్లి విద్యా వ్యవస్థ గురించి అవగాహన తెలుసుకుని అదే తరహాలో తమిళనాడులో రూపొందించారు. మంచి వ్యవస్థ ఎక్కడ ఉన్నా దాన్ని తమ ప్రజలకు అందించడం పాలకుల పని అని అన్నారు.ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ వచ్చాక ఢిల్లీ అన్ని విషయాల్లో అభివృద్ది చెందింది .ఉచిత కరెంట్ , విద్యా వ్యవస్థ , బస్తీ దవకానలు ఉన్నాయి. మంచి మనసున్న నాయకుడు ఉంటే ప్రాంతం ఎల్లపుడూ అభివృద్ది లో దుసుకోపోతుంది. రానున్న రోజుల్లో పంజాబ్ ను రంగీలా పంజాబ్ గా తిరిగి తీసుకొస్తామని అన్నారు.

## విద్యార్థుల ర్యాలీ

**మదనపల్లె**

ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నందు విద్యా బోధన ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. నేడు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాలలో ఉన్న కోర్సులు, సౌకర్యాలకు సంబంధించిన అంశాలను వివరిస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కృష్ణవేణి మాట్లాడుతూ మదనపల్లి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, విశాలమైన లైబ్రరీ, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం ఉందన్నారు. కావున తమ పిల్లలను మదనపల్లె ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ఎమ్మెల్సీల కోసం కసరత్తు

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఒక ఉపాధ్యాయ, మరో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు షెడ్యూల్ రిలీజయింది. కానీ త్వరలో ఎమ్మెల్యే, గవర్నర్ కోటాలో మరో ఐదుఎమ్మెల్సీ పదవులు ఖాళీ కనున్నాయి. వీటికోసం పార్టీలో చాలా మంది ముఖ్య నేతలు పోటీ పడుతున్నారు. వచ్చేది ఎన్నికల కాలం కావడంతో టిక్కెట్ ఇవ్వలేని. పార్టీ వదులుకోలేని నేతలకు చాన్స్ ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో తమకు అవకాశం కల్పించాలంటూ.. కేసీఆర్ పై ఒత్తిడి పెంచుతున్న సీనియర్ల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వి. గంగాధర్‌గౌడ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, నవీన్‌కుమార్ ల పదవీకాలం మార్చి 29తో ముగుస్తుంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియామకమై డి. రాజేశ్వర్‌రావు, ఫరూక్ హుస్సేన్ పదవీ కాలం మే నెల 27న ముగుస్తోంది. అయితే ఈ ఐదింటికి ఎన్నికల కమిషన్ ఇంకా షెడ్యూల్ ఇవ్వలేదు. ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులు నేరుగా రాజకీయ నియామకాలు కావడంతో ఎన్నికల ఏడాదిలో ఈ పదవులను ఆశిస్తున్న పార్టీ నేతలు బీఆర్ఎస్ పెద్దల దగ్గర ఇప్పటికే తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మెజారిటీ టికెట్లని అధినేత కేసీఆర్ ఇప్పటికే సంకేతాలివ్వడంతో ఈసారి టికెట్ ఆశిస్తున్న ఇతర నేతలు ముందుగా ఎమ్మెల్సీ పదవి చేజిక్కించుకుని తర్వాత టికెట్ల కోసం ప్రయత్నించవచ్చని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎమ్మెల్యే ఎమ్మెల్యే, గవర్నర్ కోటాల్లో ఎమ్మెల్సీ పదవుల్లో ఉన్నవారిలో కొందరికి పదవి దక్కకపోవచ్చని ప్రచారం జరుగుతుండడంతో పదవులు ఆశిస్తున్నవారి సంఖ్య పెరుగు తోంది. ని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సీటును గతంలో ఇచ్చినట్లుగానే ఈసారి కూడా ఎంఐఎంకు ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఈ సీటు విషయంపై అసదుద్దీన్ ఓవైసీ కేసీఆర్ ను కలిసిచర్చించారు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌తో దాదాపు సమానంగా కార్పొరేటర్ సీట్లు గెలిచినప్పటికీ మేయర్ పదవికి మజ్లిస్ పోటీ పడలేదు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 127 ఓట్లుండగా సింహభాగం ఓట్లు బీఆర్ఎస్, ఎంఐఎంలకు చెందినవే. అసెంబ్లీలో కేటీఆర్, అక్బరుద్దీన్ మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సమయంలో వచ్చే ఎన్నికల్లో తాము యాభై స్థానాల్లో పోటీ చేస్తామని సవాల్ చేశారు. అయితే అది వాగ్వాదం మాత్రమేనని రాజకీయంగా రెండు పార్టీల మధ్య కోపరేషన్ ఉంటుందని.., ఈ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నిరూపించాలని ఈ రెండు పార్టీల ముఖ్య నేతలు అనుకుంటున్నారు.ఎన్నికల ఏడాది కావడంతో ప్రతి పదవిని ఆచితూచి అన్ని సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని భర్తీ చేయాలని అధిష్టానం భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఎమ్మెల్సీ పదవుల పందేరం బీఆర్ఎస్‌లో రసవత్తరంగా మారింది. కేసీఆర్ ఈ ఐదు ఎమ్మెల్సీ సీట్లతో వీలైనంత వరకూ సీనియర్ నేతల అసమ్మతిని తగ్గించేందుకు ఉపయోగించుకుంటారని చెబుతున్నారు. ఖమ్మం లాంటి చోట్ల కొంత మందికి సీట్లను సర్దుబాటు చేయడం కష్టంగా ఉంది. అలాంటి చోట.. ఎవరో ఒకర్ని ఒప్పించి.. ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల కాలపరిమితి మార్చినెలాఖరుకే ముగియనుండటంతో.. వచ్చే నెల ప్రారంభంలోనే షెడ్యూల్ రావొచ్చని అంచనా వేస్తున్నారు.

# తవ్వే కొద్ది ధరణిలో సమస్యలు

**నల్గొండ :**

ధరణి పోర్టల్‌లో తవ్వే కొద్దీ సమస్యలు వెలుగు చూస్తున్నాయి. భూవిస్తీర్ణంలో మార్పులకు అవకాశం ఇవ్వకపోవడం, కొత్త పహాణీలు అందుబాటులో లేకపోవడం, ఏజీపీఏలను పరిగణనలోకి తీసుకోక పోవడం వంటి పలు సమస్యలు బయటపడుతున్నాయి. ఇటీవల భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)గా బాధ్యతలు చేపట్టిన నవీన్‌మిత్తల్.. రాష్ట్రంలోని భూసంబంధిత సమస్యల్లో ప్రధానమైన ధరణి పోర్టల్‌ను సులభతరం చేయడంపై దృష్టి కేంద్రీకరించారు. ఈ పోర్టల్ ద్వారా ఎదురవుతున్న కీలక సమస్యలను గుర్తించి పరిష్కరించే క్రమంలో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేపట్టాలని నిర్ణయించారు.జిల్లా కలెక్టర్, ఆర్డీవోలు, జిల్లాలోని అందరు తహసీల్దార్లతో సమావేశమై ప్రధానంగా ధరణి పోర్టల్‌లో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి గల అవకాశాలను గురించి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ క్రమంలో ధరణి సమస్యల పరిష్కార లాగిన్ జిల్లా కలెక్టర్లకు కాకుండా తహసీల్దార్లకు ఇవ్వాలని కొందరు సూచించినట్టు తెలిసింది. ధరణిలో అటు రైతులకు, ఇటు రెవెన్యూ యంత్రాంగానికి ప్రధానంగా ఎదురవుతున్న సమస్యలపై యాదాద్రి జిల్లా యంత్రాంగం ఓ నివేదికను కూడా మిత్తల్‌కు అందజేసింది. కాగా 'పైలట్'తరహాలో యాదాద్రికి వచ్చిన మిత్తల్.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని రెవెన్యూ అధికారులతో సమావేశం కావాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఒక రైతుకు వాస్తవానికి ఎకరం భూమి ఉంటే ధరణి రికార్డుల్లో రెండు ఎకరాలుగా పొరపాటుగా నమోదైంది. ఈ పొరపాటును సవరించే/తొలగించే ఆప్షన్ ధరణి పోర్టల్‌లో అందుబాటులో లేదు. గతంలో కొందరు వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేసుకున్నారు. ఈ భూములకు నాలా ప్రొసీడింగ్స్ కూడా జారీ అయ్యాయి. కానీ కొన్నిచోట్ల అవి వ్యవసాయ భూములుగానే ఉన్నాయి. దీంతో సదరు రైతులు/సంస్థలు/పరిశ్రమలు తమ భూముల మారి?పడి కోసం ధరణిలోని 33 మాడ్యూల్ కింద మిస్సింగ్ సర్వే నంబర్ల కేటగిరీలో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ దరఖాస్తులను కలెక్టర్ లాగిన్‌లో పరిష్కరించిన తర్వాత కూడా అవి వ్యవసాయ భూములుగానే కనబడుతున్నాయి. కొన్ని భూములకు ఇచ్చిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీలు ధరణిలో ప్రాసెస్ కావడం లేదు. వీటిని ప్రాసెస్ చేసేందుకు పట్టాదారు బయోమెట్రిక్ వివరాలను ధరణి పోర్టల్ అడుగుతోంది. ధరణి పోర్టల్ ద్వారా భూ సంబంధిత సమస్యలను పరిష్కరించుకునేందుకు అసలు పట్టాదారుకు కాకుండా థర్డ్ పారీ?టలు కూడా దరఖాస్తు చేస్తున్నారు. ఇలా ఒక సర్వే నంబర్‌లో థర్డ్ పార్టీలు (పట్టాదారుకు తెలియకుండా) దరఖాస్తు చేసుకుని ఉంటే.. అసలు పట్టాదారు లేదా ఆ సర్వే నంబర్‌లోని మరో పట్టాదారు దరఖాస్తు చేసుకునేందుకు ధరణి అనుమతించడం లేదు. ఇప్పటికే దరఖాస్తు పెండింగ్‌లో ఉందని చెబుతోంది. ఈ విషయంలో థర్డ్ పార్టీలను నియంత్రించే పద్ధతి తీసుకురావాలి. ధరణి పోర్టల్‌లో తాజా పహాణీలు అందుబాటులో లేవు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, తహశీల్దార్ల లాగిన్‌లలో కొత్త పహాణీలు అందుబాటులో ఉంచాలి. కొందరు రైతులు తమ భూములను తనఖా పెట్టి బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చుకుంటున్నారు. అలాంటి మారి?టగేజ్ భూములకు డూప్లికేట్ పాసు పుస్తకాలు తీసుకుని సేల్‌డీడ్‌లు చేసుకునే వెసులుబాటును తొలగించాలి. ధరణి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో రైతులకు సంబంధించిన వివరాలను పొరపాటుగా నమోదు చేస్తే, దరఖాస్తు పూర్తయిన తర్వాత మళ్లీ ఆ వివరాలను సవరించుకునే అవకాశం లేదు. వారసత్వ హక్కులు (పౌతీ) కల్పించే క్రమంలో ఈ?పాసు పుస్తకాలు వస్తున్నాయి కానీ, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదు. బ్యాంకర్లు రుణాలిచ్చేందుకు పౌతీ ప్రొసీడింగ్స్ అడుగుతున్నారు. ధరణి పోర్టల్‌లో ఆధునీకరించిన లేదా సవరించిన వివరాలు అందుబాటులో లేవు. సదరు రైతుకు సంబంధించిన అప్‌డేటెడ్ సమాచారం (సర్వే నంబర్, ఖాతా, విస్తీర్ణం లాంటి వివరాలు) అందుబాటులో ఉంచాలి. గతంలో ఆర్డీవోలు జారీ చేసిన నాలా ప్రొసీడింగ్స్‌ను అప్‌డేట్ చేసే ఆప్షన్ ఇవ్వాలి. గతంలో జారీ చేసిన 13?బి, 38ఈ సర్టిఫికెట్ల అప్‌డేషన్‌కు కూడా ఆప్షన్ తీసుకురావాలి. క్రయ విక్రయ లావాదేవీల కోసం బుక్ చేసిన స్లాట్‌లను అనివార్య పరిస్థితుల్లో రద్దు చేసుకునే ఆప్షన్ ఇవ్వాలి.

# భూకబ్జాల ఆరోపణలతో గులాబీ నేతలు

**వరంగల్ :**

వరంగల్ జిల్లా బీఆర్ఎస్ లో నాయకులను భూ కబ్జాల ఆరోపణలు వెంటాడుతున్నాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలో చాలాకాలంగా కబ్జాలపై విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ కార్పొరేటర్లు మొదలుకొని ఎమ్మెల్యేల వరకు ఖాళీ జాగా కనిపిస్తే వదలడం లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నలుగురు ఎమ్మెల్యేలు.. వారి అనుచరుల భూదందాలపై కథలు కథలుగా చెప్పుకొనే పరిస్థితి ఉంది. కబ్జాల ద్వారానే వాళ్లు వందల కోట్లకు పగడలెత్తారని అధికారపార్టీలోనే టాక్. 2018 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఇదే పనిగా పెట్టుకుని.. సామాన్యులనూ వదలడం లేదనే చర్చ సాగుతోంది. వీటిపై ఇంటెలిజెన్స్ వర్గాలు ప్రభుత్వ పెద్దలకు సమాచారం కూడా ఇచ్చాయట. తాజాగా నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల భూకబ్జాలపై అధికారపార్టీకే చెందిన ఓ ఎంఎల్ సీ నివేదిక ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. అది ఓరుగల్లు గులాబీ శిబిరంలో కలకలం రేపుతోంది.ఆ నలుగురు ఎమ్మెల్యేలతోపాటు జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులు ఏ విధంగా భూ కబ్జాలు చేస్తున్నారో తన నివేదికలో పూసగుచ్చినట్టు వెల్లడించారట ఆఎంఎల్ సీ. బీఆర్ఎస్ అధిష్ఠానానికి దగ్గరగా ఉండే ఆ శాసనమండలి సభ్యుడు నేరుగా సీఎంకే ఆ రిపోర్ట్ ఇచ్చారట. ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేస్తున్న తీరును అందులో ప్రస్తావించారట. ఈ విషయం తెలిసినప్పటి నుంచి అధికారపార్టీలో ఆ నలుగురు ఎమ్మెల్యేలకు నిద్ర కరువైనట్టు సమాచారం. పార్టీ పెద్దలతో ఉన్న పరిచయాల ఆధారంగా ఎంఎల్ సీ నివేదికపై ఆరా తీస్తున్నారు ఆ శాసనసభ్యులు. ప్రస్తుతం ఓరుగల్లు రాజకీయాల్లో ఎవరిని కదిపినా ఎంఎల్ సీ నివేదికే వారి మధ్య హాట్ టాపిక్.ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేతలు.. పాదయాత్ర చేసిన షర్మిల తదితరులు ప్రధానంగా ఎమ్మెల్యేలపై భూకబ్జా ఆరోపణలే చేశారు. ఆ మధ్య ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ తన భూమిని కబ్జా చేశారని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నేత కొండా మురళీ ఆరోపించారు. దానిపై వాడీవేడీ చర్చ జరుగుతున్న సమయంలోనే ఎంఎల్ సీ నివేదికపై సమాచారం బయటకు రావడంతో గులాబీ శిబిరం ఉలిక్కి పడింది. వరంగల్ తూర్పు నుంచి పోటీ చేయాలని చూస్తున్న కొండా దంపతులు.. ఏమైనా ఉంటే అక్కడి ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయాలి కానీ.. పశ్చిమ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌ను ఎందుకు టార్గెట్ చేశారన్నది మరో ప్రశ్న. కొండా మురళీ భూమిని కబ్జా చేయడం సాధ్యమా అనేది గులాబీ నేతల వాదన. ఇందులో ఏదో కుట్ర ఉందని మురళీ ఆరోపణలను వినయ్ భాస్కర్ కొట్టిపారేస్తున్నా.. ఎంఎల్ సీ నివేదికే వాళ్లను కలవర పెడుతోందట.ఎంఎల్ సీ నివేదికలో ప్రస్తావించారని అనుకుంటున్న నలుగురు ఃఖీూ ఎమ్మెల్యేల్లో వినయ్ భాస్కర్ ఉన్నారా.. లేరా అనేది మరో డౌట్. ఒకవేళ వినయ్ భాస్కర్ ఉంటే.. మిగతా ఆ ముగ్గురు ఎమ్మెల్యేలు ఎవరు? తరచూ భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల పేర్లు ఆ రిపోర్ట్‌లో ప్రస్తావించారా లేదా? అని పార్టీ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఒకవేళ ఆ ఎమ్మెల్సీ నివేదికను పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్‌లకు టికెట్లపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందా? అని టెన్షన్ పడుతున్నారట గులాబీ శాసనసభ్యులు. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. వరంగల్ ల్యాండ్‌మైన్ గులాబీ శిబిరంలో గుబులు రేపుతోందనే చెప్పాలి.

# ఎంపి జీవీఎల్ ను సన్మానించిన కాపు నేతలు

**విజయవాడ**

పార్లమెంట్ లో వంగవీటి రంగా గురించి ప్రస్తావించిన బీజేపీ ఎంపి జీవీఎల్ నరసింహారావును రాధా రంగ మిత్ర మండలి, కాపు సంఘాల ప్రతినిధులు గురువారం సన్మానించారు. విజయవాడలోని జీవీఎల్ నివాసంలో అయనను సన్మానించారు. జీవియల్ ను కలిసి వంగవీటి రాధాకృష్ణ మేనమామ చెన్నుపాటి శ్రీను ధన్యవాదాలు తెలిపారు. రాధా రంగ రాయల్ అసోసియేషన్ నేత బాలాజీ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా ప్రజల కోసం ప్రాణాలు విడిచారు. కులమతాలకు అతీతంగా అందరి మనసులో నిలిచారు. అటువంటి వ్యక్తి పేరుతో జిల్లా పెట్టమంటే ప్రభుత్వం పట్టించుకోలేదు. బిజెపి ఎంపి జీవియల్ పార్లమెంటు లో రంగా జీవితం ప్రస్తావించారు. ఆయన పేరుతో జిల్లా పేరు పెట్టాల్సిన అవసరం ఉందని జీవియల్ అడిగారు. అందుకే ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపామని అన్నారు. వైసిపి లో ఉన్న కాపు నాయకులకు పదవులు కావాలి. రంగా పేరు చెప్పుకుంటారు... ఆయన పేరు జిల్లాలకు పెట్టడానికి కృషి చేయలేదు. అనేక డిమాండ్ లు వచ్చినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించ లేదని అన్నారు. త్వరలోనే విజయవాడ కాపు నాడు సమావేశం పెడతాం. కాపులను ఐక్యం చేసి రంగా పేరును జిల్లాకు పెట్టాలని పోరాటం చేస్తాం . జగన్మోహన్ రెడ్డి తన వ్యక్తిగత కారణాల వల్ల రంగా కు ప్రాధాన్యత తగ్గించారు. రంగా కు పేరును జిల్లా కు పెట్టే వారికే మా మద్దతు అని వెల్లడించారు.
జగన్ తీరు వల్ల నేడు మా కాపులంతా ఒకమాట మీదకు వచ్చారు. అందరినీ ఐక్యం చేసిన జగన్ కు మా ధన్యవాదాలు. రంగా నాడు ఎర్పాటు చేస్తాం. విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు.

# 5500 కోట్ల అప్పుల్లో జీహెచ్ఎంసీ

**హైదరాబాద్ :**

జీహెచ్ఎంసీలో రోజురోజుకు తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం నుంచి కార్పొరేషన్‌ను గట్టెక్కించేందుకు అధికారులు సరికొత్త ప్రయత్నం చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోగా, సొంత ఆర్థిక వనరులతో నిధులను సమకూర్చుకుంటే వాటిని మౌలిక వసతులు, పౌరసేవల నిర్వహణకు గాక, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పనులకు వెచ్చించడం, రూ.5500 కోట్ల పైచిలుకు అప్పులు పెరిగిపోవటంతో బల్దియా ఇప్పుడు దిక్కు తోచని స్థితిలో ఉంది. ఇక బల్దియాకు మిగిలినది ఆస్తులొక్కటే.ఇప్పటికే లీజుకిచ్చిన ఆస్తులకు సంబంధించిన లీజు గడువు ముగిసిన వాటిపై ఎలాంటి చర్యలు చేపట్టాలన్న విషయంపై కసరత్తు కొనసాగుతుండగా, లీజుకు సబ్ లీజుగా ఏర్పడి, లీగల్ కేసులున్న ఆస్తులపై లీగల్ గానే ముందుకెళ్లి, త్వరగా పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. కనిష్టంగా రెండు ఎకరాల స్థలంలో ఉన్న ఆస్తులు, గరిష్టంగా ఐదు ఎకరాల స్థలంలో ఉన్న ఆస్తులను లీజుకిస్తే కొంత మేరకైనా ఆదాయం సమకూరుతుందనే దిశగా అధికారులు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.తొలి దశగా సికింద్రాబాద్ హరిహర కళాభవన్, బుద్ధభవన్, అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్ వంటివి కార్పొరేట్ సంస్థలకు లీజుగా ఇస్తే వీటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దే అవకాశాలుంటాయని, దశాబ్దాలుగా నామమాత్రపు అద్దెలు, లీజు ఛార్జీలతో సరిపెట్టుకున్న బల్దియాకు ఇప్పుడు పెద్దమొత్తంలో అద్దె రూపంలో నిధులు సమకూర్చుకునే అవకాశముంటుందని బల్దియా భావిస్తున్నట్లు సమాచారం.గతంలో బల్దియా ప్రజాప్రయోజనాల కోసం ఇతర శాఖలకు ఎలాంటి చార్జీల్లేకుండా ఇచ్చిన స్థలాలను ఆయా ప్రభుత్వ శాఖలు ఇప్పుడు కమర్షియల్ సంస్థలను నిర్వహించుకుంటున్నాయి. ఆర్థికంగా బలోపేతంగా ఉన్నపుడు





మహానగరవాసులకు వివిధ రకాల సేవలందించే ఆర్టీసీ వంటి సంస్థలకు బల్దియా ఉచితంగా ఆస్తులనిచ్చినా, కష్టాలల్లో ఉన్న బల్దియాకు ఆర్థిక చేయూత నందించేందుకు ప్రభుత్వం గానీ, ఏ ఇతర ప్రభుత్వ శాఖ గానీ ముందుకు రాకపోవటం గమనార్హం. ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అద్దెకిచ్చే విషయమై సర్కారుకు ప్రతిపాదనలు పంపినట్లు సమచారం.ప్రస్తుతం బల్దియాలో అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం మొత్తం 3వేల స్థలాల్లో ఆస్తులున్నాయి. వీటిలో వివిధ మార్కెట్లలో 2,229 షాపులు ప్రధాన ప్రాంతాల్లో ఉండగా, 874 మలిగీలు వివిధ షాపింగ్ కాంప్లెకులున్నాయి. మరో 91 లీజు ల్యాండ్‌లున్నాయి. వీటిలో 1996లో కేవలం రూ.5 వేలు విలువ చేసిన భూమి ధర ఇప్పుడు రూ.2 కోట్లకు పెరిగిన భూములున్నాయి. 1988లో 18 ఎకరాల బల్దియా స్థలాన్ని కార్పొరేషన్ మహాత్మగాంధీ బస్ స్టేషన్ నిర్మాణం కోసం ఆర్టీసీకి ఇచ్చింది.దీనికి సంబంధించి ఎలాంటి అద్దె కూడా బల్దియా ఆశించలేదు. ఈ స్థలంలో నగరవాసుల కోసం టాయిలెట్లు, హోటల్స్, డార్మెటరీలు నిర్మించాలని లీజులో ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. కానీ ఆర్టీసీ నేడు ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇక్కడి స్థలంలో క్యాంటీన్ లు, షాపులను, ఏటీఎంలను కూడా నిర్మించింది. బల్దియాకు చెందిన మరికొన్ని ఆస్తులు అన్యాక్రాంతమయ్యేందుకు కొందరు అధికారుల హస్తం కూడా ఉన్నట్లు గతంలో బయటపడింది.అక్రమార్కులైన కొందరు అధికారులు అద్దెలను వసూలు చేసుకుని లక్షల రూపాయలను తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు గుర్తించినా చర్యలెందుకు చేపట్టడం లేదన్నది హట్‌టాపిక్‌గా మారింది. దశాబ్దాల ప్రయత్నంరెవెన్యూలో కీలకంగా ఉండే టౌన్ సర్వే ల్యాండ్ రికార్డు (టీఎస్ఎల్ఆర్) ప్రకారం బల్దియా మొత్తం 275 భూములను లీజుకిచ్చినట్లు రికార్డుల్లో ఉన్నట్లు అధికారవర్గాల సమాచారం.కానీ వీటిలో కేవలం 104 భూములకు సంబంధించిన భూముల రికార్డులను మాత్రమే బల్దియా గుర్తించింది. ఇందులో 50 భూములు సెంట్రల్ జోన్‌లో ఉన్నట్లు, మరో 32 నార్త్ జోన్‌లో ఉన్నట్లు గుర్తించింది. ఈ భూములు ప్రస్తుతం గజానికి రూ.లక్ష విలువ పలికే భూములున్నట్లు సమాచారం. వీటికి సంబంధించి కూడా జీహెచ్ఎంసీలో పూర్తి వివరాలున్నా, క్షేత్రస్థాయిలో భూములు అన్యాక్రాంతమయ్యాం ం2002లో తీగల కృష్ణారెడ్డి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2005లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో బల్దియా ఆస్తులకు సంబంధించిన రికార్డులపై తీవ్రస్థాయిలో చర్చ జరగటంతో అప్పట్లో రికార్డుల కోసం అధికారులు ప్రయత్నం చేసినట్టుగానే చేసి, అంతా మామూలేనన్నట్టు మౌనం వహించారు. ఆస్తులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా భద్రపర్చుకోకపోవటం, సరిగ్గా నిర్వహణ చేపట్టకపోవటానికి ఉన్నతాధికారుల నిర్లక్ష్యం ప్రధాన కారణం కాగా, సిబ్బంది మరో కారణంగా చెప్పవచ్చు. బహిరంగంగా జీహెచ్ఎంసీ మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్సుల అద్దెలను వసూలు చేసుకుని జేబులు నింపుకుంటున్నా, కనీసం ప్రశ్నించే వారే కరవ-య్యారు.

# జగన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే వైఎస్ వివేకా హత్య

**విజయవాడ :**

సీఎం జగన్మోహన్ రెడ్డి పై టీడీపీ నేత, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే వైఎస్ వివేకా హత్య జరిగిందని ఆరోపించారు. బాబాయిని చంపడానికి ఎంపీ టిక్కెట్ కారణమని పేర్కొన్నారు. ఈ కేసులో విజయసాయిరెడ్డి ని కూడా సీబీఐ విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. తన తప్పులు బయటపడుతుంటే సీఎం జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కోడికత్తి కేసు నాలుగేళ్లు అయినా ఎందుకు విచారణ సాగుతోందని ప్రశ్నించారు. ఏపీ రాజధాని విషయంలో ముఖ్యమంత్రి తుగ్లక్ నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. అసలు ఏపీకి సీఎం జగన్‌రెడ్డా..? సజ్జల



రామకృష్ణారెడ్డా అని అయ్యన్న పాత్రుడు ప్రశ్నించారు.
వివేకానంద రెడ్డి హత్యను జగన్ రెడ్డి ఆనాడు చంద్రబాబు కు ఆపాదించారని, అవినీతి పత్రికలో విషం కక్కారని అయ్యన్న పాత్రుడు దుయ్యబట్టారు. జగన్ అధికారంలోకి వచ్చాక హత్య కేసు మాఫీ చేయాలని చూశారని.. ఇప్పుడు సీబీఐ విచారణలో వాస్తవాలు బయటకి వస్తున్నాయన్నారు. రక్తపు మడుగులో ఉంటే విజయసాయి రెడ్డి గుండె పోటు అని ఎలా చెప్పారని ప్రశ్నించారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## కంటి వెలుగును ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ

**మంథని**

మంథని మున్సిపల్ పరిధిలోని ఐదవ వార్డు కూచిరాజుపల్లి ప్రభుత్వ పాఠశాలలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు గురువారం మంథని మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ ప్రారంభించారు. ప్రజలకు వైద్యులచే కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదవ వార్డు కౌన్సిలర్ నక్క నాగేంద్ర శంకర్, నాలుగవ వార్డ్ కౌన్సిలర్ కుర్ర లింగయ్య, టిఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు బుద్ధార్తి రాణి,మున్సిపల్ కమిషనర్ యు. శారద, వైద్యులు శంకరమ్మ, సతీష్ కుమార్, ఏఎన్ఎం లలిత, సునీత, డిసిఓ సతీష్, ఆశా వర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదాన కార్యక్రమం

**శ్రీశైలం**

శ్రీశైల భ్రమరాంబిక శివరాత్రి ఉత్సవాలలో భాగంగా, శ్రీ శరణ బసవేశ్వర సదాశివయ్య అన్న సత్రములో ప్రతిరోజు వేలాదిమంది, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాదాపు శివరాత్రి ఉగాది పురస్కరించుకొని లక్షలాదిమంది, భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సత్రం దాత ఆంధ్ర తెలంగాణ వీరశైవ అధ్యక్షుడు (నేతి మహేష్) ఆధ్వర్యంలో జరుగుచున్నది.కమిటీ సభ్యులు బసవరాజ్ జంకండి, (కర్ణాటక )సంగారెడ్డి బీదర్, కర్ణాటక (మేనేజ్మెంట్) నాగరాజు, సేవా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అయ్యప్ప దేవాలయంలో కుంబాభిషేకానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

**మంథని**

: అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26, 27 రోజులలో మంథని పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో జరిగే మహా కుంభాభిషేకానికి ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబుకు అయ్యప్ప స్వామి దేవాలయ ఆలయ కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ బాబును శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఓడ్నాల శ్రీనివాస్, మల్కా రామారావు, ఎమ్మెస్ రెడ్డి, వెంగళదాసు ఐలయ్య, గుండా రాజు, తోట రాజలింగం, జక్కుల చంద్రశేఖర్, జేజి బాబు లు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు పరామర్శ

**అరకులోయ**

అరకులోయ నియోజకవర్గ హుకుంపేట మండలంలోని తాడిపుట్టు పంచాయతీ ఉర్రడా బొడ్డపుట్టు గ్రామంలో విద్యుత్ స్తంభం పడి మృతి చెందిన విద్యార్థి తుబురు ధన్విత కుటుంబాని పారామర్శించి ధైర్యం చెప్పి న.అరకు పార్లమెంట్ కోశాధికారి వంతాల నాగేశ్వరరావు మాట్లాడుతూ మృతి చెందిన ధన్విత కు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమేలి సత్యవతి వైస్ ఎంపిపి సుడిపల్లి కొండలరావు డుంబ్రిగూడ ఎస్టిసెల్ అధ్యక్షుడు గోల్లోరి ప్రసాద్ మాజీ సర్పంచ్ దేవన రాజు వంతాల చంటి బోయిన రవి గోల్లోరి రమేష్ తదితరులు పాల్గొన్నారు

## లారీ దగ్ధం

**తిరుపతి**

కలకత్తా – చెన్నై జాతీయ రహదారిపై భూదానం టోల్ ప్లాజా సమీపంలో లారీ ప్రమాదవశాత్తు కాలిపోయింది. తిరుపతి జిల్లా చిల్లకూరు మండల పరిధిలోని జాతీయ రహదారి భూదానం టోల్ ప్లాజా సమీపంలో గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ప్రమాదవశాత్తు ఒక లారీ కాలిపోయింది చిల్లకూరు పోలీసులు కథను మేరకు చెన్నై నుండి విజయవాడకు టైల్స్ తయారీలో వినియోగించే ముడి సరుకుతో వెళుతున్న లారీ టోల్ ప్లాజా వద్ద లారీ టైర్ పంచర్ కావడంతో మంటలు చల్లరేగి లారీ పాక్షికంగా కాలిపోయింది . స్థానికంగా ఉన్న టోల్ ప్రజా సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు . ఈ మేరకు చిల్లకూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

**మదనపల్లె**

అన్నమయ్య జిల్లా మదనపల్లె జడ్పీ హైస్కూల్ ను ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సామాగ్రిని పంపిణీ కేంద్రంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్డీవో మురళి తెలిపారు. నేడు మదనపల్లి పట్టణంలోని ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో పరిశీలించారు. ఈయన వెంట తాసిల్దార్ శ్రీనివాసులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె ప్రాంతాలకు సంబంధించి ఎన్నికల సామాగ్రిని జడ్పీ హైస్కూల్ నుండి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

# ప్రజలతో మమేకం కావాలి

**సూర్యాపేట**

గురువారం నాడు సూర్యాపేట ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశం లో కేసుల నమోదు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు కేసుల స్థితిగతులు, పోలీసింగ్ నిర్వహణ, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు, పోలీస్ పని విభాగాల నిర్వహణ మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించడం జరిగినది. ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలి. రోడ్డు భద్రత అందరి బాధ్యత. సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజలతో మమేకమై, ప్రజలను భాగస్వామ్యులను చేసి స్నేహపూర్వక పోలీసింగ్ చేయాలని, అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని అన్నారు. గ్రామాల్లో, కాలనీల్లో, వ్యాపార సముదాయాలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు కృషి చేయాలనీ, ప్రజలకు వ్యాపారులకు సీసీటీవీ కెమెరాల ఉపయోగం అవశ్యకతను అవగాహన కల్పించాలని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటలిజెన్స్ బాగా సేకరించాలని ఏవైనా అవాంఛనీయ సంఘటనలు, అక్రమ వ్యాపారాలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు పటిష్టం చేయాలని అన్నారు. వాహనాల తనిఖీల సమయంలో జాగ్రత్తగా ఉండాలని అన్నారు.

ప్రతిరోజూ జిల్లా అంతటా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం, రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యత, ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం అన్నారు, వాహనదారులు అన్ని అనుమతి పత్రాలు కలిగి, లైసెన్స్, ఇన్స్యూరెన్స్, బండికి నబర్ ప్లేట్ కలిగి ఉండాలని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపవదని కోరారు. పోలీసింగ్ విధి విధానాలపై స్టేషన్ నిర్వహణపై డిఎస్పీలు, సిఐలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుండాలని సిబ్బందికి అవసరమైన సలహాలు సూచనలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమం నందు డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వర రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు రాజేష్, అనాజనేయులు, శివ శంకర్, ఖఔఅ ప్రసాద్, నాగర్జున, రాజశేఖర్, గౌరినాయుడు, ఆర్ఐ లు శ్రీనివాసరావు, శ్రీనివాస్, నర్సింహారావు, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఎస్ఐ లు, ఐటీ కోర్, డీసీఆర్బీ స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ హై టెన్సన్ లైన్ ల్ కింద మంటలు పెట్టవద్దు

**కమాన్ పూర్**




రామగుండం పరిధిలో 400 కే.వీ. అధిక విద్యుత్ లైన్(హై టెన్సన్ లైన్) ల కింద మంటలు పెట్టవద్దని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు, చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ అన్నారు. గురువారం రత్నాపూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో రామగుండం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసారు. పవర్ గ్రిడ్ వారి 400 కె.వి అధిక విద్యుత్తు లైన్ ( పెద్ద లైన్) ల కింద రైతులు తమ పత్తి, కంది, మిరప, జొన్న, చెరుకు మొదలగు పంటల నుండి ఏర్పడిన, మిగిలిపోయినటువంటి ఎండిపోయిన గడ్డి, చెత్త,పుల్లలను తగుల పెట్టకూడదని అన్నారు.ఇలా చేయడం వలన లైన్ లలో అంతరాయం కలుగుతుందని, దీనివలన కరెంటు సరాఫర కు అంతరాయం కలుగుతూ, విద్యుత్ ప్రమాదాలకు దారి తీస్తున్నాయని అన్నారు. మిగతా ప్రాంతములకు తగిన రీతిలో

కరెంట్ సరఫరా చేయలేకపోతున్నామని అన్నారు. కావున రైతులందరూ గమనించి వారి పొలాల్లోని ఎండు గడ్డి, చెత్త, పుల్లలను పెద్ద కరెంటు లైన్ ల నుంచి దూరంగా తీసుకపోగలరని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ మహేందర్, పంచాయతీ సెక్రెటరీ పెండ్లి రమ్య, రైతులు జక్కుల రాజయ్య, ఉడుత మల్లయ్య, సందవెనా కుమార్, మేకల రాంచందర్ , కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థలు,జన వికాస్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు

**కడప**



జన వికాస్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ ఎం డీ తాహిర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు కడప నగరంలో పెద్ద ఎత్తున సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ మన్సూర్ అలీఖాన్ ,రాష్ట్ర సలహాదారులు నూనె నాగేష్, పీవీ రమణ,డాక్టర్ శ్రీనివాసులు,రాష్ట్ర కార్యదర్శి యునుస్ బాషాలు తెలియజేశారు.ఈరోజు మారుతీ నగర్ లో ఉన్న సమితి కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మా అధ్యక్షుడు జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని స్వచ్ఛంద సంస్థలు కలసి పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని ఇందులో భాగంగా రేపు ఉదయం కొన్ని వృద్ధ ఆశ్రమాలలో,అనాథ పిల్లల వసతి గృహాలలో అల్పాహారం మరియు పండ్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందని అలాగే బృహదా బ్లడ్ బ్యాంక్ నందు ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని అలాగే మధ్యాహ్నం నగరంలోని అన్ని ఆశ్రమాలలో,నిరాశ్రయుల వసతి గృహాలలో,ఆశ నిలయం మూగ చెవిటి వసతిగృహంలో మానసిక వికలాంగుల కేంద్రంలో రోడ్లపై ఉన్న నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని అలాగే వస్త్రదాన కార్యక్రమంలు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం,మొక్కలు నాటే కార్యక్రమం అలాగే క్రీడలకు ప్రోత్సాహం కోసం పోలీస్ స్పోర్ట్స్ గ్రౌండ్ నందు తాహిర్ప్రీమియర్ లీగ్ సెషన్ –3 క్రికెట్ ట్రోఫీ కూడా ఉంటుందని వారు తెలియజేశారు.రక్త దాతలు ఎవరైనా ఉంటే రమేష్ హాల్ ఎదురుగా ఉన్న బృహదా బ్లడ్ బ్యాంక్ లో జరిగే ఉచిత రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు.జన వికాస్ అభిమానులు అందరు ప్రతి ఒక్కరు కూడా ప్రతీ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో జన వికాస్ ప్రతినిధులు తాజుద్దీన్, డాక్టర్ శ్రీనివాసులు,సీఎస్ నాసిర్ అలీ,అబ్దుల్ వాజిద్,వాలేపు శివ,స్ఫూర్తి ఎ హోప్ ఫౌండర్ వెంకటేష్,షేర్ హెల్ప్ టీమ్ ఫౌండర్ అలిషేర్,ఖాన్ కా రిష్తా అధ్యక్షుడు తారిఖ్ అలీ,లక్ష్మి నరసింహా పలు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మాయ మాటలతోనే కేసీఆర్ అధికారం

**హైదరాబాద్ :**

నల్గొండ హలియ మున్సిపాలిటీ అనుముల గ్రామంలో హాత్ సే హాత్ జొడో యాత్రలో మాజీ సీఎల్పీ నాయకుడు జానారెడ్డి పాల్గొ?న్నారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ.. లక్షల ఎకరాలకు సాగు నీరు అందించింది నేను? కేంద్రంలో మోదీ తెలంగాణాలో కేసీఆర్ పోలీసుల ద్వారా బెదిరిస్తున్నారని ఆయన అన్నారు. మాయ మాటలు, ఎలక్షన్ టైంలో డబ్బుల మూటల సంచులతో వొచ్చి గెలుస్తున్నడు కేసీఆర్ అని ఆయన ఆరోపించారు. దళితుల మూడెకరాల భూమి హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగు భృతి రైతు రుణమాఫీ ఏమైందని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అరాచకాలు మోసాలను ప్రజలకు వివరించేందుకు ఈ యాత్ర ఉద్దేశమని ఆయన వివరించారు. అధికారం లేకున్నా మీకు అండగా తోడుగా నిలుస్తున్నానని, అనుముల గ్రామంలో ప్రజాశక్తితో నేను చెక్ డ్యాం నిర్మిస్తానన్నారు. అనుముల గ్రామ ప్రజల దీవెనతో రాష్ట్రానికి సేవ చేసే భాగ్యం నాకు దక్కిందని జానా రెడ్డి వ్యాఖ్యానించారు.ఇదిలా ఉంటే.. హనుమకొండ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని అయినవోలు మండల కేంద్రం నుండి నేడు రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ప్రారంభమైంది. అయినవోలు మల్లన్నను దర్శించుకున్న అనంతరం మండల కేంద్రంలోని నంది విగ్రహం నుండి పాదయాత్రను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అయినవోలు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ మీదుగా పాదయాత్ర జరుగుతుండగా? మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు

## లారీ క్లీనర్ అనుమానాస్పద మృతి

**గూడూరు**

తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా ఈగాపురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యనీ (52) అనే లారీ క్లీనర్ బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు . ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది . చిల్లకూరు పోలీసులు సమాచారం మేరకు సుబ్రహ్మణ్యం లారీ క్లీనర్ గా పనిచేస్తున్నాడు . విజయవాడ నుండి చెన్నైకి లారీలో వెళు తుండగా కలకత్తా – చెన్నై జాతీయ రహదారి చిల్లకూరు మండల పరిధిలోని రైటర్ సత్రం సమీపంలో మృతి చెందాడు . మృతికి కారణాలు తెలియాల్సి ఉంది . మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు . లారీ యజమానికి సమాచారం అందించారు .

## మెదక్ జిల్లాల్లో ప్రేమ జంట ఆత్మహత్య

**మెదక్,**

మెదక్ జిల్లా నార్సింగిలో విషాదం చోటుచేసుకుంది. ఫిబ్రవరి 14వ తేదీన ప్రేమికుల దినోత్సవం రోజు నుంచి కనిపించకుండా పోయిన ప్రేమ జంట అదృశ్యం కేసు విషాదాంతంగా ముగిసింది. తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన జంట.. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గురువారం ఉదయం నార్సింగి చెరువులో నుంచి ప్రేమ జంట మృతదేహాలను వెలికితీశారు. జిల్లాలోని నార్సింగికి చెందిన కల్పన, ఖలీల్ గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే వీరద్దరి ప్రేమ విషయం ఇరుకుటుంబాల్లో తెలిసిపోయింది. మతాలు వేరు కావడంతో వీరి పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ మీరు పెళ్లి చేసుకునేందుకు మేము ఒప్పుకోమంటూ చెప్పారు. దీంతో జంట తీవ్ర మనస్తాపానికి గురైంది. కలిసి జీవించలేని తాము కనీసం చావుతోనైనా ఒకటవుదామని భావించారు. ఈ క్రమంలోనే ప్రేమికుల దినోత్సవం నాడే ఈ ప్రేమ జంట ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. ఇద్దరూ కలసి నార్సింగి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే పిల్లలు కనిపించకపోవడంతో.. ఇరు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వాళ్ల సెల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా వాళ్లు ఎక్కడున్నది తెలుసుకున్నారు. వెళ్లి చూసే సరికి కల్పన, ఖలీల్ చెరువులో మృతదేహాలై తేలారు. ఇదే విషయాన్ని పోలీసులు ఇరుకుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆపై మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరిలించారు. చేతికి అంది వచ్చిన పిల్లలు.. ఇలా చలనం లేకుండా పడి ఉండడం చూసి ఇరుకుటుంబాల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వికారాబాద్ జిల్లా, చౌడపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ అనే యువకుడు చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాడు. కొంతకాలం నుంచి ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. వీరిద్దరూ కొంతకాలం కలిసి షికార్లు చేశారు. ప్రేమలో మునిగితేలుతున్నా కెరీర్ మీద ఫోకస్ తప్పలేదు ప్రవీణ్. కానిస్టేబుల్ ఎగ్జామ్ రాసి ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాడు. ఈవెంట్స్ సైతం పూర్తి చేసుకుని, మెయిన్స్ కు ప్రిపేర్ అవుతున్నట్లు సమాచారం. కానీ ఈ క్రమంలో ప్రేమించిన యువతి ప్రవీణ్ ను మోసం చేసింది. ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి తనను కాదని మోసం చేసి వేరే అబ్బాయి సన్నిహితంగా ఉంటూ అతడితో వివాహానికి సిద్దమైంది. ఈ విషయాన్ని ప్రియుడు జీర్ణించుకోలేక పోయాడు.ప్రాణంగా ప్రేమించిన అమ్మాయి తనను మోసం చేసిందని తీవ్ర మనస్తాపానికి గురై పెద్ద నిర్ణయం తీసుకున్నాడు ప్రవీణ్. ఇక జీవితం వద్దనుకుని చనిపోవాలని నిర్ణయించుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్ కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు ప్రవీణ్. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి ఆత్మహత్య చేసుకున్న చోట సూసైడ్ నోట్ తో పాటు తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసుకున్నట్లు గుర్తించారు.

## ద్విచక్రవాహనంపై చిన్నారి మృతదేహం

**అల్లూరి సీతారామరాజు జిల్లా**

ప్రభుత్వాసుపత్రులు అంటేనే దడపుట్టే స్థితి నెలకొంటోంది. ప్రాణాలు కాపాడలేని ప్రభుత్వాసుపత్రుల పరిస్థితి దయనీయంగా మారింది. మందులు చికిత్సల సంగతి పక్కనపెడితే.. కనీసం చనిపోయిన పసిబిడ్డ మృతదేహాన్ని ఇంటికి చేర్చలేని దారుణ ఘటనలు సర్వత్రా ఆందోళన రేకెత్తిస్తున్నాయి. అలాంటిదే అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగిపుట్టు మండలం కుమడలో జరిగిన విషాద ఘటన మనసుని కలచివేస్తోంది. కేజీహెచ్‌లో మృత్యువాత పడిన తమబిడ్డని తిరిగి ఇంటికి తీసుకెళ్ళేందుకు అంబులెన్స్ కావాలని పసికూన తల్లిదండ్రులు ఆసపత్రి సిబ్బందిని కాళ్ళావేళ్ళాపడ్డా ఫలితం లేకుండా పోయింది. దీంతో బిడ్డ మృతదేహాన్ని చేతుల్లో పెట్టుకుని స్కూటీపై 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాడేరుకి ప్రయాణించాల్సి వచ్చింది ఆ దంపతులు.విషయం తెలుసుకున్న పాడేరు ఆసుపత్రి సిబ్బంది స్వగ్రామానికి అంబులెన్స్ ఏర్పాట్లు చేశారు. మరోవైపు కేజీహెచ్ ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తమ బిడ్డను కోల్పోయామని తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు.కాగా, ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పలువురు ఆసుపత్రి సిబ్బంది నిర్వాకంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

# సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు

**హైదరాబాద్**

ముఖ్యమంత్రి కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా కెసిఆర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నారు. శాట్ ఆధ్వర్యంలో చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తారు. చెస్ ఛాంపియన్ షిప్ పోటీల వాల్ పోస్టర్ ను స్పోర్ట్స్ మినిస్టర్ శ్రీనివాస్ గౌడ్, శాట్ చైర్మన్ ఆంజినేయ గౌడ్ గురువారం ఆవిష్కరించారు.
మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ప్రతి సంవత్సరం పలు క్రీడా కార్యక్రమాలు చేపడుతున్నాం. రాష్ట్ర స్థాయి మహిళలు చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు, ప్రతి జిల్లాలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఈ నెల 17 న ఎల్ బీ స్టేడియం లో చెస్ పోటీలు జరుగుతాయి. తెలంగాణ రాష్టం లోని పలు జిల్లాల నుండి క్రీడాకారులు హాజరు కానున్నారు. దాదాపు 10 వేల మంది మహిళలు పాల్గొంటారు.. ఇటీవల గెలుపొందిన పలు చెస్ ఛాంపియన్ షిప్ క్రీడాకారులను సన్మానిస్తాము. ఎలాంటి ఎంట్రీ ఫీజ్ లేదు. వయస్సు నిమిత్తం లేకుండా పోటీలు జరుగుతాయి. ప్రతి గ్రామం లో క్రీడాకారులకు పెద్ద పీఠ వేస్తుంది తెలంగాణ ప్రభుత్వం. దేశానికి క్రీడల్లో తెలంగాణ రాష్టం ఆదర్శంగా నిలిచేలా చేస్తున్నాం. కెసిఆర్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చెయ్యాలని అన్నారు.

# ఎస్.ఐ ఉద్యోగాల వ్రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

**కడప**



కడప నగరంలో ఈ నెల 19 న ఆదివారం నిర్వహించనున్న ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ వ్రాత పరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ ఆదేశించారు. గురువారం నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాలు లో ఎస్.ఐ ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా ఎస్.పి సమీక్ష నిర్వహించి భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకూ జరగనుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ.. కడప నగరంలోని 11 పరీక్షా కేంద్రాలలో మొత్తం 9540 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. 11 కేంద్రాల ను నాలుగు రూట్లుగా విభజించి బందోబస్త్ ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో సౌకర్యాలు కల్పించాలి. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద తప్పక సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలి. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలి. మొబైల్స్ , ఇతర డిజిటల్ పరికరాలుఅనుమతించకూడదు. మాల్ ప్రాక్టీస్ కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకొంటాం. ప్రతి సెంటర్ నందు పోలీసు సిబ్బందితో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ద్వారా పర్యవేక్షణ ఉంటుంది. ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలి ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్ ) తుషార్ డూడి ఐ.పి.ఎస్, వై.వి.యు ప్రొఫెసర్, రీజియన్ కో ఆర్డినేటర్ డా. రఘునాధ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ బి. రాజా ప్రభాకర్, ఆర్.ఐ సోమశేఖర్ నాయక్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, ఇన్విజిలేటర్లు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# బద్దాపూర్ తండాలో పులి సంచారం

**వికారాబాద్ :**

తెలంగాణలో అటవీ ప్రాంతాల్లోని ప్రజలను పులుల సంచారం భయాందోళనకు గురి చేస్తోంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని బద్లాపూర్ తాండ అటవీ ప్రాంతంలో పులి సంచారిస్తున్నట్లు స్థానికులు వెల్లడించారు. అటవీ ప్రాంతం సమీపంలో ఉన్న ఒక వ్యవసాయ పొలంలోని కుక్కపై పులి దాడి చేసి తిన్నట్లుగా తెలుస్తోంది. అయితే.. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు పులి సంచరించిన ప్రాంతాన్ని సందర్శించారు. పులి పాదముద్రలు గుర్తించేందుకు అధికారుల ప్రయత్నం చేస్తున్నారు. గతంలో మైల్వార్ తండాలో సంచరించిన పులి.. పక్కనే కర్ణాటక రాష్ట్రం అటవీ ప్రాంతం కలుపుకొని ఉండడంతో తరచూ పులులు సంచరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే.. పులి సంచారం గురించి తెలియడతో ఆ తండాతో పాటు పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించిన అటవీ శాఖ అధికారులు సూచించారు. అయితే.. వేరుశనగ పంట పండి చేతికొచ్చే దశలో ఉందని పొలాలకు కాపలాగా వెళ్లకుంటే అడవి పందులు పంటను నాశనం చేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే.. గత మూడు రోజు క్రితం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో పులి . సోమవారం సిర్పూర్ మండలం వెంపల్లి బొందలబ్రిడ్జి సమీపంలో వాహనదారులకు పులి కనిపించిందని ప్రయాణికులు తెలిపారు. కారులో వెళ్తున్న వ్యక్తులు పులిని సెల్ ఫోన్ లో బంధించినట్లు తెలిపారు. పులి సంచారంతో సిర్పూర్ ప్రాంతంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

# ఇంకా విషమంగానే తారక రత్న

**బెంగళూరు :**



తీవ్రమైన గుండెపోటుతో ఆస్పత్రిపాలైన నందమూరి తారకరత్న ఆరోగ్య అత్యంత విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించినట్లుగా సమాచారం అందుతోంది. ఇంతకాలం ఆయన కొలుకుంటున్నారని భావించినా.. ఇప్పుడు ఆయన ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారినట్లు తెలుస్తోంది. గత 20 రోజులుగా బెంగళూరులోని నారాయణ హృదయాలయలో చికిత్స పొందుతున్న తారకరత్నకు విదేశీ వైద్యులచే చికిత్స అందించారు. మధ్యలో కాస్త కోలుకున్నట్లు కనిపించినా.. మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. ఇవాళ తారకరత్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో.. మరోసారి స్కానింగ్ చేశారు వైద్యులు. మరికాసేపట్లో తారకరత్న ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులెటిన్ విడుదల చేయనున్నారు వైద్యులు. టీడీపీ యువ సారధి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో నందమూరి వారసుడు, సినీ నటుడు తారకరత్న కూడా పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా లోకేష్ తో కలిసి నడుస్తుండగా.. తీవ్రమైన గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం అక్కడి నుంచి బెంగళూరులోని నారాయణ హృదాయలకు తరలించారు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. విదేశాల నుంచి కూడా వైద్యులను రప్పించి చికిత్స అందించారు. కానీ, ఆయన ఆరోగ్యంలో ఎలాంటి మెరుగుదల కనిపించలేదు.

# శిధిలావస్థలో బద్వేల్ రూరల్ పోలీస్ స్టేషన్ పాత భవనం

**బద్వేలు**



బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్ పాత భవనం శిథిలావస్థలో ఉంది దాదాపు రెండు దశాబ్దాలుగా ఈ భవనానికి ఇదే పరిస్థితి గోపవరం మండలం సముదాయంలో ఈ భవనాన్ని అప్పట్లో దాదాపు 15 లక్షల రూపాయలతో నిర్మించారు అప్పటి జిల్లా ఎస్పీ గోవింద సింగ్ అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి దివంగత వీరారెడ్డి అప్పటి జిల్లా కలెక్టర్ ఈ భవనాన్ని ప్రారంభించారు భవనం ప్రారంభించిన కేవలం మూడు నెలలు మాత్రమే రూరల్ పోలీస్ స్టేషన్ కొత్త భవనంలో కొనసాగింది జాతీయ రహదారికి అత్యంత సమీపంలోనే ఈ భవనం ఉంది పోలీస్ స్టేషన్ కు సమీపంలోని ఎరసల కనుమల్లో భారీ ఎన్కౌంటర్ జరిగి దాదాపు పదిమంది మావోయిస్టులు మృతి చెందారు అప్పట్లో ఈ విషయం కడప నెల్లూరు జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది ఎన్కౌంటర్ జరిగిన తర్వాత కొన్ని నెలలు ఈ భవనంలోనే పోలీస్ స్టేషన్ కొనసాగింది ఆ తర్వాత పోలీస్ స్టేషన్కు రక్షణ ఉండదన్న భయంతో రూరల్ పోలీస్ స్టేషన్ బద్వేల్ కు తరలించారు అప్పటినుంచి బద్వేల్ లోనే పోలీస్ స్టేషన్ కొనసాగుతుంది బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్ కు ఘనమైన చరిత్ర ఉంది బద్వేల్ లో ఒకప్పుడు కేవలం ఒక పోలీస్ స్టేషన్ మాత్రమే ఉండేది బద్వేల్ లో ఉన్న గోపవరం మండలం పోలీస్ స్టేషన్ కు బద్వేల్ పోలీస్ స్టేషన్ గా మార్పు చేసి కొన్ని రోజులు బద్వేల్ లోనే ఉంచారు ముందు గోపవరం మండలం బ్రాహ్మణ పల్లెలో మొట్టమొదట పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు ఆ తర్వాత కొద్ది కాలానికి గోపవరం కాలనీ లో ఉన్న భవనాల లోకి స్టేషన్ తరలించారు ఆ తర్వాత మరికొద్దికాలానికి బద్వేల్ పట్టణానికి తరలించడం జరిగింది అప్పట్లో గోపవరం మండలానికి ప్రత్యేక పోలీస్ స్టేషన్ భవనం ఉండాలని నిర్ణయించిన ఉన్నతాధికారులు ఈ మేరకు ప్రతిపాదనలు పంపారుఆ మేరకు కొత్త భవనాన్ని నిర్మించారు భవనం నిర్మించిన కొన్ని నెలలకే ప్రారంభించారు కొత్త భవనం లోకి బద్వేల్ లో ఉన్న పోలీస్ స్టేషన్ ను తరలించారుకాస్త మున్నాళ్ళ ముచ్చటగా మారింది పోలీస్ స్టేషన్ తిరిగి బద్వేల్ కు వచ్చిన తర్వాత సరైన అలనా పాలనా లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది ఈ భవనం ఇప్పుడు అత్యంత దయనీయంగా మారింది అని చెప్పాలి భవనం పూర్తిగా శిథిలం కాకముందే ఉన్నతాధికారులు దీని పై దృష్టి పెట్టాలి ఈ మేరకు మండల ప్రజలు కోరుతున్నారు

# వినికిడి కలిగించిన హైదరాబాద్ డాక్టర్లు

**హైదరాబాద్ :**

అతిబీద దేశాల్లో ఒకటైన సుడాన్ దేశానికి చెందిన ఓ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీళ్లలో మొదటి అబ్బాయి 15 ఏళ్ల బాసిల్ అహ్మద్, ఏడేళ్ల వయసున్న రెండో అబ్బాయి ఎల్మాగ్ డాడ్, ఏడాది వయసున్న మూడో అబ్బాయి అబ్దుల్ అహ్మద్. అయితే ఈ ముగ్గురు చిన్నారులు పుట్టుకతోనే పూర్తిగా వినిడిని కోల్పోయారు. తమ కుమారులకు ఎలాగైన సరే మళ్లీ చెవులు వినిపించేలా చేయాలని తల్లిదండ్రులు ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. మొదటి కుమారుడు పుట్టిన తర్వాత నుంచి వాళ్లకు చెవులు వినిపించేలా చేసేందుకు ఎన్నెన్నో దేవుళ్లకు మొక్కారు. కానీ ఫలితం లేకుండా పోయింది. అయితే సుడాన్ కు చెందిన ఈ దంపతులు తమ కుమారుల కోసం వేరే దేశానికి వెళ్లి అయినా సరే చికిత్స అందించాలనుకున్నారు. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈఎన్ టీ సర్జన్ ల గురించి తమకు అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా తెలుసుకున్నారు. చివరికి హైదరాబాద్‌లో చికిత్స చేస్తారని తెలుసుకొని ముగ్గురు పిల్లలతో సహా దంపతులు ఇక్కడకు వచ్చారు. హైదరాబాద్ లోని కేపీహెచ్బీ కాలనీలో ఉన్న మైక్రోకేర్ ఈఎన్ టీ ఆస్పత్రిలో తమ పిల్లలను చేర్పించారు. పరీక్షలు చేసిన వైద్యులు వారికి అరుదైన శస్త్ర చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ముగ్గురు చిన్నారులకు మూడు రోజుల పాటు ఒకరి తర్వాత ఒకరికి కోక్లియర్ ఇంప్లాంటేషన్ అనే అత్యంత కిష్టమైన సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఈ ముగ్గురు చిన్నారులకు చెవులు వినిపిస్తున్నాయి. తమ పిల్లలకు చెవులు వినిపించేలా చేసిన మైక్రోకేర్ ఈఎన్ టీ ఆస్పత్రి వైద్యులకు సుడాన్ దంపతులు ధన్యవాదాలు తెలిపారు. పుట్టుకతోనే వినికిడి కోల్పోయిన చిన్నారులకు చెవులు వినిపించేలా చేయడం తమకు కూడా చాలా సంతోషాన్ని ఇచ్చిందని వైద్యులు చెబుతున్నారు. మైక్రోకేర్ ఈఎన్టీ ఆస్పత్రి చీఫ్ డాక్టర్ విన్నకోట ప్రకాష్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అరుదుగా జరిగే శస్త్ర చికిత్సల్లో ఒక టైన ఈ కోక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీని ఆస్పత్రిలో అందుబాటులో ఉందని వివరించారు. పుట్టు మూగ, చెవిటి సమస్యని సమూలంగా రూపుమాపే ఆధునిక వైద్యాన్ని అందించడంలో తామెప్పుడూ ముందుటామని తెలిపారు. ఇలాంటి శస్త్ర చికిత్స ప్రాముఖ్యతని ప్రజలంతా తెలుసుకోవాలని, ముఖ్యంగా అవగాహన కల్గి ఉండాలని ఆయన సూచించారు. అప్పుడే పుట్టిన పిల్లలకు వినికిడి పరీక్షలు చేయించాలి. వారికి వినికిడి సమస్య ఉన్నట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా తగిన చికిత్స అందించాలి. చిన్నతనంలోనే గుర్తించే ఇలాంటి సమస్యలను చికిత్సలతో నయం చేయవచ్చు. వినికిడి, మూగ సమస్యలను సమూలంగా పారద్రోలవచ్చు. పుట్టుకతో వినికిడి సమస్య ఉన్న వారికి కూడా ఆధునిక శస్త్ర చికిత్స ద్వారా తిరిగి చెవులు వినపడేలా చేయవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. నైపుణ్యం కలిగిన మైక్రో కేర్ ఈఎన్టీ హాస్పిటల్ వైద్యులు ఇలాంటి శస్త్రచికిత్సలు చేయడంలో అనుభవం ఉంది. కొన్ని ఇంప్లాటేషన్ పరికరాలను ఛార్జ్ చేసుకోవడం గతంలో కష్టంగా ఉండేది. కానీ ప్రస్తుతం ఎలాంటి నిర్వహణ అవసరం లేని ఇంప్లాటేషన్ టెక్నాలజీ అందుబాటులో ఉంది. మరికొన్నింటికి మొబైల్ కు ఛార్జింగ్ పెట్టుకున్నంత సులభంగా ఛార్జ్ చేసుకునే వీలుందని మైక్రోకేర్ ఈఎన్టీ వైద్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విన్నకోట శ్రీప్రకాశ్, డాక్టర్ చిన్నీ శ్రీ, డాక్టర్ వేణు గోపాల్ సహా మైక్రోకేర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కొండ పోచమ్మ వద్ద పంజాబ్ సీఎం

**హైదరాబాద్ :**



పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సింగ్ మాన్ రెండోసారి తెలంగాణ పర్యటనకు వచ్చారు. సిద్దిపేట జిల్లాలో ఆయన పర్యటించారు. గజ్వేల్ నియోజకవర్గంలోని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ను పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు పంజాబ్ సీఎంకు వివరించారు. కాళేశ్వరం నుంచి 618 మీటర్ల ఎత్తులో కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్ ఉన్నదని, 15 టీఎంసీల సామర్థ్యంతో ఈ రిజర్వాయర్‌ను ప్రభుత్వం నిర్మించిందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఇది 2,85,280 ఎకరాలకు సాగు నీరు అందిస్తుందని వివరించారు. అనంతరం కొండపోచమ్మ సాగర్ పంపు హౌస్‌ను, తొగుటలోని మల్లన్న సాగర్ ప్రాజెక్టును సీఎం భగవంత్ సింగ్ మాన్ సందర్శించనున్నారు. పంజాబ్ లో భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో ఆ రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ సింగ్ తెలంగాణలో పర్యటిస్తున్నారు. ఇక్కడ భూగర్భ జలాల పెరుగుదలకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మోడల్‌ను స్వయంగా పరిశీలించనున్నారు. అందుకోసం ఆయన పంజాబ్ నీటిపారుదల అధికారులతో పాటు తెలంగాణ పర్యటనకు వచ్చారు. తెలంగాణలో గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం కట్టించిన చిన్న చిన్న డ్యామ్‌ల వల్ల భూగర్భ జలాలు 2 మీటర్ల వరకూ పెరిగాయి. ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి గజ్వేల్ కి పంజాబ్ సీఎం బయలుదేరి వెళ్లారు. కొండపోచమ్మ రిజర్వాయర్, మల్లన్నసాగర్, మర్కుక్ పంప్ హౌస్, పాండవుల చెరువును ఆయన పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, దాని అనుబంధ ప్రాజెక్టుల వల్ల భూగర్భజలాల పెరుగుదల, మిషన్ కాకతీయ గురించి పంజాబ్ సీఎం బృందానికి నీటిపారుదల అధికారులు తెలియజేశారు. భూగర్భ జలాలను పరిరక్షించేందుకు కొన్నేళ్లుగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పనులను భగవంత్ మాన్ బృందం పరిశీలించింది. మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యామ్ ల నిర్మాణం తదితర పనులను అధ్యయనం చేశారు. భూగర్భ జలాల పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం పర్యటన ముగించుకుని హైదరాబాద్ కు తిరిగివెళ్లారు.

### ప్రాజెక్టు అద్భుతం

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ పర్యటన సిద్ధిపేట జిల్లాలో కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు, నీటి పారుదల ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా కొండ పోచమ్మ సాగర్ రిజర్వాయర్‌ను పరిశీలించి ప్రాజెక్టును నిశితంగా పరిశీలించారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంజాబ్ లో నీటి పొదుపు కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగానే తెలంగాణలోని నీటి ప్రాజెక్టులను సందర్శిస్తామన్నారు. కొత్త టెక్నాలజీకి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి తెలంగాణ వద్ద ఉన్న డ్యామ్‌ను పరిశీలించేందుకు వచ్చామని సీఎం భగవంత్ మాన్ ట్వీట్ చేశారు. భూగర్భ జలాలను పొదుపు చేసే సాంకేతికత గురించి సమాచారం తెలుసుకుంటామన్నారు. తెలంగాణ ప్రభుత్వం భూగర్భ జలాలను కాపాడేందుకు గ్రామాల్లో చిన్న డ్యామ్‌లు నిర్మించిందని, దీంతో ఇక్కడ భూగర్భ జలాలు 2 మీటర్ల వరకు పెరిగాయన్నారు. అనంతరం మర్కుక్ మండలం ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల మధ్య ఉన్న చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తారు. అనంతరం మల్లన్ సాగర్, గజ్వేల్ పట్టణంలో మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసిన పాండవుల చెరువును కూడా పరిశీలిస్తారు. మర్కుక్ పంపు హౌస్ ని పరిశీలించిన అనంతరం పంజాబ్ సీఎం భగవంత్ మాన్ మాట్లాడుతూ.. తెలంగాణతో పాటు.. పంజాబ్ లో అన్ని రకాల వనరులు ఉన్నాయని, అక్కడ సాంకేతికతను బాగా సద్వినియోగం చేసుకుంటున్నామన్నారు.

# సుప్రీం సాయిధరమ్ తేజ్ చేతుల మీదుగా "వెయ్ దరువెయ్ " టీజర్ రిలీజ్



సుప్రీం సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ ఈ సినిమా టీజర్ చాలా ఇంటరెస్టింగ్ గా ఉంది, సినిమా చూడాలి అని కూతుహలాన్ని రేపుతుంది, సినిమా ఖచ్చితంగా తెలుగులో సక్సెస్ అవ్వాలని.. సాయి అన్న కి మరియు డైరెక్టర్ , ప్రొడ్యూసర్ కి మరిన్ని అవకాశాలు రావాలని కోరుకుంటున్నాను. సినిమా లో పని చేసిన వాళ్ళ అందరికి అల్ బెస్ట్ చెప్తున్నాను.

హీరో సాయి రామ్ శంకర్ గారు మాట్లాడుతూ సుప్రీం సాయిధరమ్ తేజ్ గారి చేతుల మీదుగా టీజర్ రిలీజ్ చేయటం చాల ఆనందంగా ఉంది మా సినిమా నుంచి ఇది వరకే రెండు సాంగ్స్ రిలీజ్ అయినవి వాటికీ చాల మంచి విశేష స్పందన వచ్చింది యూట్యూబ్ లో ట్రెండ్ అయినవి మరియు కోటి కి పైగా వ్యూస్ రావటం చాల ఆనందం గా ఉంది. పాటలు ఎలా అయితే నచ్చిందో ఈ సినిమా టీజర్ అంతకు మించి ఉంది . సినిమా చాల బాగా వచ్చింది. మీకు తప్పకుండ నచ్చుతుంది అని మరొక సారి మా ప్రొడ్యూసర్ గారికి , ఈ టీజర్ రిలీజ్ చేసిన సుప్రీం సాయిధరమ్ తేజ్ గారు థాంక్స్ చెప్తూకుంటున్నాను

దర్శకుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ " టీజర్ విడుదల చేసిన సాయిధరమ్ తేజ్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదలు , మా సాంగ్స్ ని మంచి రీచ్ చేసిన తెలుగు ప్రేక్షకులకి నా శతకోటి నమస్కారాలు, టీజర్ కూడా బాగా నచ్చుతుంది అని ఆశిస్తున్నాను. మా హీరో సాయి గారు , ఆయన నా మీద ఉంచిన నమ్మకాన్ని జయించాను అనే అనుకుంటున్నాను " అని అన్నారు. నా నా మీద నమ్మకం తో ఈ అవకాశాన్ని ఇచ్చిన ప్రొడ్యూసర్ గారికి కూడా థాంక్స్ చెప్తున్నాను.

ప్రొడ్యూసర్ దేవరాజ్ మాట్లాడుతూ " సాయిధరమ్ తేజ్ గారి చేతుల మీదుగా మా సినిమా టీజర్ రిలీజ్ అయినందుకు ఆనందం గా ఉంది. మేము అనుకున్నట్టే చాలా బాగా వచ్చింది సినిమా , హీరో గారి కెరీర్ లో మరొక మంచి సినిమా అవుతుంది అని మేమంతా గట్టిగా నమ్ముతున్నాం" అని అన్నారు ఈ సినిమా ఈ ఏడాది సమ్మర్ లో రిలీజ్ అవుతుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తిచేసుకొని మార్చ్ లో రిలీజ్ కి ప్లాన్ చేస్తున్నాము. హీరో సాయి రామ్ శంకర్ , హీరోయిన్ యాశ శివ కుమార్ , సునీల్ , కాశి విశ్వనాథ్ , పోసాని కృష్ణ మురళి , పృథ్వి , తదితరులు నటిస్తున్నారు .




# ఏడు భారీ సెట్స్ లో పాట చిత్రీకరణ జరుపుకుంటున్న నాగ చైతన్య, 'కస్టడీ'



అక్కినేని నాగ చైతన్య, వెంకట్ ప్రభు క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక తెలుగు-తమిళ ద్విభాషా చిత్రం 'కస్టడీ' ప్రస్తుతం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిత్రీకరణ జరుపుకుంటోంది. లీడ్ పెయిర్ - నాగ చైతన్య, కృతి శెట్టిపై ఒక పాటను గ్రాండ్ గా రూపొందిస్తున్నారు. ఈ పాట చిత్రీకరణ కోసం ఏడు విభిన్నమైన భారీ సెట్లు వేశారు. ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్, ఆర్ట్ డైరెక్టర్ డివై సత్యనారాయణ కలిసి అద్భుతమైన సెట్స్‌ని రూపొందించారు. మాస్ట్రో ఇళయరాజా, లిటిల్ మాస్ట్రో యువన్ శంకర్ రాజా కలిసి ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరిస్తున్న పాటకు శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ డ్యాన్స్ నంబర్ బిగ్ స్క్రీన్‌పై విజువల్ ఫీస్ట్ గా వుండబోతుంది.

సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటివరకూ ఓ గ్లింప్స్ తో పాటు, నాగ చైతన్య, కృతి శెట్టి ఫస్ట్-లుక్ పోస్టర్ లని విడుదల చేశారు.

అరవింద్ స్వామి విలన్ పాత్రలో నటిస్తుండగా, ప్రియమణి పవర్ ఫుల్ పాత్రలో కనిపించనుంది. సంపత్ రాజ్, శరత్ కుమార్, ప్రేమ్ జీ, వెన్నెల కిషోర్, ప్రేమి విశ్వనాథ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నాగ చైతన్య కెరీర్‌లో అత్యంత ఖరీదైన చిత్రాల్లో కస్టడీ ఒకటి. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

ఈ చిత్రానికి సంబంధించిన తారాగణం, అద్భుతమైన సాంకేతిక బృందం ప్రస్తుతం చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. అత్యున్నత నిర్మాణ విలువలు, సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమా రూపొందుతోంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ని పవన్‌కుమార్ సమర్పిస్తున్నారు. అబ్బూరి రవి డైలాగ్స్ రాస్తుండగా, ఎస్ఆర్ కత్తిర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

కస్టడీ మే 12, 2023న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది.

నటీనటులు: నాగ చైతన్య, కృతి శెట్టి, అరవింద్ స్వామి, ప్రియమణి, శరత్ కుమార్, ప్రేమ్‌జీ అమరెన్, సంపత్ రాజ్, వెన్నెల కిషోర్, ప్రేమి విశ్వనాథ్ తదితరులు




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950